ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 19 జనవరి 2025



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, చిత్రంలో మంత్రులు మండిపల్లి, సవిత, ఎమ్మెల్యేలు



ఎన్టీఆర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు.. చిత్రంలో ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి, పుట్టాసుధాకర్ యాదవ్, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి, లింగారెడ్డి తదితరులు



మైదుకూరులో వెలుతుర్ల విష్ణువందన, వీరప్రసాద్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



హైటెక్నాలజీతో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న సీఎం

సీమ రైతులు మీసం మెలేసేలా చేస్తా

- ప్రాజెక్టులు పూర్తి చేసి.. హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా
- కొప్పర్తిలోనే ఎంఎస్ఎంఈ ఉంటుంది
- రాజోలి ద్వారా 95వేల ఎకరాలకు సాగునీరు
- కడపలో ముఠా కక్షలు నిర్మూలించింది నేనే
- కడప ఎయిర్‌పోర్టు నుంచి ప్రధాన నగరాలకు త్వరలో విమానాలు
- ఎన్టీఆర్ హయాంలోనే ఉమ్మడి కడప జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం
- వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో..
- పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు గెలిపించండి
- కడపలో ఆరు నెలల్లో టీడీపీ సొంత కార్యాలయం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం

స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జనం



కడప, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి సీమరైతులు మీసం మెలేసేలా చేస్తానని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. కడప జిల్లాను సమగ్రాభివృద్ధి చేస్తామని, జిల్లాను అటు పరిశ్రమలకు స్మార్ట్‌సిటీగా, పండ్లతోటలకు హబ్‌గా మారుస్తామన్నారు. అసలు కరువు నేల రాయలసీమలో ఎన్టీఆర్ హయాంలోనే బీడు భూములకు నీళ్లందించేందుకు ప్రాజెక్టులకు అంకురార్పణ చుట్టామన్నారు.

శనివారం మైదుకూరులో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు, స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబా బు మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలోనే జిల్లాలో తెలుగుగంగ, గండికోట, గాలేరునగరి, సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఆర్టీపీపీ ప్రాజెక్టు పురుడు పోసుకుందన్నారు. వైసీపీ నేతలు కథలు చెప్పడం తప్పక జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. నీటి ప్రాజెక్టులకు అంకురార్పణ చేసింది టీడీపీనే అన్నారు. వరి పండించడంకంటే పండ్లతోటలు సాగు చేస్తే నాలుగింతల ఆదాయం వస్తుందన్నారు. తన హయాంలోనే 90 శాతం సబ్సిడీతో మైక్రో ఇరిగేషన్ డ్రిప్ ఇరిగేషన్ తీసుకు వచ్చామన్నారు. అది వైసీపీ హయాంలో నిలిపివేశారని అయితే ఇప్పుడు మళ్లీ తీసుకువచ్చామన్నారు.

రాజోలి రిజర్వాయరు తండ్రీ కొడుకులు పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారని అయితే వైసీపీ హయాంలో ఏమీ చేయలేదన్నారు. దీన్ని పూర్తి చేసి 95వేల ఎకరాలకు సాగునీరందిస్తామని హామీ ఇచ్చారు. కడపలో ఒకప్పుడు ముఠా కక్షలుండేవని వాటిని తన హయాంలోనే అణిచివేశామన్నారు. కడప ఎయిర్‌పోర్టుకు మహర్దశ తన హయాంలోనే ఏర్పడిందన్నారు. రన్‌వే విస్తరణ, నైట్‌ల్యాండింగ్, ఎయిర్‌పోర్టు విస్తరణ అప్పుడే జరిగిందన్నారు. వైసీపీ హయాంలో ఫ్లైట్లు రాక మూతపడిందని. అయితేకూటమి వచ్చాక ఇప్పుడు ఫ్లైట్లు తిరుగుతున్నాయన్నారు. ఇక రాబోవు రోజుల్లో కడప ఎయిర్‌పోర్టు నుంచి ఎక్కడికైనా వెళ్లిరావచ్చన్నారు.

గండికోటను అభివృద్ధి చేస్తాం

గండికోట ప్రపంచంలోనే అందమైన టూరిజం ప్రాజెక్టుల్లో ఒకలని, దీన్ని అభివృద్ధిపరుస్తామని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.80 కోట్లు మంజూరు చేసిందని.. దీంతో అభివృద్ధి చేస్తే ఇక్కడకు వచ్చే పర్యాటకులతో రోజూ ఉపాధి పెరుగుతుందన్నారు.

హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా

మన జీవనాడి పోలవరం పూర్తయితే అక్కడ నుంచి సముద్రంలో వృధాగా పోతున్న 300 టీఎంసీల నీటిని రాయలసీమకు తీసుకువస్తే ఇక్కడ రైతులు మీసం మెలేసే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. ఇక్కడికి నీరు వస్తే రాయలసీమ అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. గ్రోత్‌లో కడప, అనంతపురం ముందుకు వస్తున్నాయని.. ప్రాజెక్టులు పూర్తయితే కడప జిల్లా హార్టికల్చర్ హబ్‌గా మారి రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. ఇక కొప్పర్తిలో ఉన్న ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును తరలించమని, అది ఇక్కడే ఉంటుందని హామీ ఇచ్చారు.

కోటి సభ్యత్వాలతో రికార్డు

కార్యకర్తలే శ్రీరామరక్ష అన్నారు. నారాలోకేశ్ జాతీయ కార్యదర్శి అయిన తరువాత సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. కోటి సభ్యత్వాలతో రికార్డు సృష్టించారని తెలిపారు. రూ.130 కోట్లతో బీమా అమలు చేస్తున్నామన్నారు. టీడీపీకి కార్యకర్తలు ప్రాణంతో సమానం అన్నారు. అవినీతిని ప్రశ్నించినందుకు నందం సుబ్బయ్యను ప్రొద్దుటూరులో బలిగొన్నారన్నారు. కడపలో ఆగస్టు 15నాటికి సొంత పార్టీ ఆఫీసును నిర్మించనున్నామన్నారు. ఇక మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారని, వాటిని ప్రాముఖ్యతపరంగా పూర్తి చేస్తామన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

1982లో దివంగత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీతోనే సాధ్యమైందని అన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు సాగునీటి ప్రాజెక్టులు, ఎంతోమంది రాజకీయ భిక్ష టీడీపీలో జరిగిందన్నారు. కిలో రూ.2 బియ్యం, జనతా వస్త్రాలు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ఎన్టీఆర్‌తోనే సాధ్యమయ్యాయన్నారు.

రాజకీయంగా బీసీల ఎదుగుదల ఎన్టీఆర్‌తోనే..

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలోనే కడపజిల్లాకు సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభం అయ్యాయన్నారు. బీసీల అభివృద్ధికి రాజకీయంగా సంక్షేమ పథకాలు అందించింది ఆయనతోనే అన్నారు. ఇక మైదుకూరులో వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ కళాశాల భవనాల నిర్మాణం, మార్కెట్‌యార్డు ఇతర వాటి నిర్మాణాలు మైదుకూరులో సిమెంటురోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం వంద కోట్లు కేటాయించండి అని కోరారు. ఇక్కడ మున్సిపాలిటీలో మౌలిక వసతులు కోసం వంద మంది సిబ్బందిని నియమించాలంటూ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పుట్టాసుధాకర్‌యాదవ్, ఆర్.మాధవి, ఎస్.వరదరాజులరెడ్డి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు లింగారెడ్డి, విజయమ్మ, బద్వేలు ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, టీడీపీ యువ నాయకులు చెరుకూరి రవికుమార్, మాచుపల్లె క్రిష్ణారెడ్డి, అమీర్ బాబు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





గ్రీన్ ఎనర్జీ గురించి సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న విద్యార్థులు

స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటిలో రోడ్లను శుభ్రం చేస్తున్న మంత్రి మండిపల్లి, కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటిటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, జిల్లాను పరిశుభ్రత జిల్లాగా తయారు చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుతో శనివారం రాయచోటి పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పరిసరాలను శుభ్రం చేసిన అనంతరం రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్‌లు బస్టాండు కూడలిలో మానవహారం నిర్వహించి అక్కడికి హాజరైన ప్రజలు, అధికారులు, సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామన్నారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, జిల్లాలోని ప్రతిఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా జిల్లాను చెత్త రహిత జిల్లాగా తయారు చేయాలన్నారు. ఇందులో భాగంగా రాయచోటి మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల్లో శుభ్రత కార్యక్రమాలను అమలు చేసి పరిసర ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రహదారుల పక్కన, కాలువలు, చెరువులు, కుంటలు వద్ద శ్రమదానం చేసి చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఇక నుంచి ప్రతి నెల మూడవ శనివారం జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : కలెక్టర్

సుండుపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, ఆసుపత్రులు, బస్టాండు, బహిరంగ ప్రదేశాలు, చెరువులు, కాలువలు, కుంటలు తదితర ప్రదేశాల్లో చెత్తాచెదారాలను తొలగించే విధంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయరాదన్నారు.

ఆరు నెలల్లో డబుల్ రోడ్డు పూర్తి చేస్తాం

రాయచోటి- సుండుపల్లె డబుల్ రోడ్డు కొద్దిగా ఇబ్బందికరంగా ఉందని, వచ్చే ఆరు నెలల్లో రోడ్డును బాగు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ.ఒక కోటి రోడ్ల కొరకు మంజూరు చేశారు. అలాగే డీఎంఎఫ్ గ్రాంటు కింద మరో రూ.80 లక్షల నిధులు కూడా మంజూరైంది. ఈ గ్రామం, మండలానికి సంబంధించిన అన్ని అభివృద్ధి పనులకు తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, మాజీ ఎంపీటీసీలు బెల్లాల రమణయ్య, మోహన్‌బాబునాయుడు, జనసేన నాయకులు రామాశ్రీనివాస్, తహసీల్దార్ దైవాదీనం, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ సురేశ్‌బాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తంబళ్లపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో శనివారం వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండల కేంద్రం సాలివీధికి చెందిన కిశోర్ స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తన తల్లి సరస్వతీతో కలిసి సంక్రాంతి పండుగకు సోమవారం రాయచోటిలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా లోపల ఉన్న ఫర్నీచర్, వంట వస్తువులు, ఫ్రిజ్, దుస్తులు తదితర వస్తువులు దగ్ధమై కనిపించాయి. వెంటనే తేరుకున్న కిశోర్ కాలిపోయిన ఇంటిని పరిశీలించగా ఫ్రిజ్ దగ్గర షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇళ్లంతా దగ్ధమైనట్లు తెలుస్తోందని చెబుతున్నాడు. నాలుగైదు సంవత్సరాల నుంచి కష్టపడి నూతన ఇళ్లు నిర్మించుకుని వస్తువులన్నీ సమకూర్చుకున్నానని, ఇప్పుడు ఇల్లు కాలిపోయిందని భోరున విలపిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయి సుమారు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు చెబుతున్నాడు. తహసీల్దారు హరికుమార్, వీఆర్వో నాగరాజు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రభుత్వం స్పందించి బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు, కుటుంబసభ్యులు కోరుతున్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఫ్రిజ్



మిరప రైతు కంట కన్నీరు

- వైరస్, తెగుళ్లతో తగ్గిన దిగుబడి

6

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 26 కేంద్రాలు
- 4242 మంది విద్యార్థులు హాజరు

వివరాలు...6లో

వైసీపీ హయాంలో టూరిజంను దోచుకున్నారు

- రాష్ట్ర టూరిజం చైర్మన్ నూకసాని బాలాజి




హార్సిలీహిల్స్‌లో పనులు పరిశీలిస్తున్న రాష్ట్ర టూరిజం చైర్మన్ నూకసాని బాలాజి

బి.కొత్తకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో టూరిజం శాఖను భ్రష్టుపట్టించి, ఎవరి స్థాయిలో వారు దోచుకున్నారని రాష్ట్ర టూరిజం చైర్మన్ నూకసాని బాలాజి పేర్కొన్నారు. ఒకరోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాత్రి ఆయన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌కు వచ్చారు. శనివారం హార్సిలీహిల్స్‌పై ఉన్న గాలిబండ, ఏరియల్ వ్యూపాయింట్, గవర్నర్ బంగ్లా, టూరిజం రెస్టారెంట్, గెస్ట్ హౌస్‌లు, కాన్ఫరెన్స్ హాల్ తదితర ప్రదేశాలలో తిరిగి పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజంశాఖ నిధులు రూ.కోట్లలో దుర్వినియోగమయ్యాయని, కొన్ని తప్పుడు నిర్ణయాలతో నిధులు పక్కదారి పట్టాయని, దీనిపై విచారణ జరిపి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. టూరిజం రవాణాశాఖలోనూ అదే దుస్థితి నెలకొందని గత ప్రభుత్వం చేసిన పొరబాట్లపై విచారణ జరుగుతోందన్నారు. వైసీపీ హయాంలో టూరిజం శాఖలో మంజూరు చేసిన పనులలో అనేక అక్రమాలు ఉన్నందున అన్ని పనులను రద్దు చేస్తున్నామన్నారు. హార్సిలీహిల్స్‌లో రూ.10 కోట్ల నిధులు కేటాయించగా ఏపీటూరిజం గెస్ట్‌హౌస్‌ల ఆధునీకరణ, మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, కానీ ఆ నిధులు సద్వినియోగం కాలేదని, దీంతో ఆ పనులను తక్షణం ఆపేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలలో హార్సిలీహిల్స్‌కు ప్రత్యేకత ఉందని, ఇక్కడ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. హరిత రెస్టారెంట్, బార్, కాన్ఫరెన్స్‌హాల్, గెస్ట్‌హౌస్‌లను ఆధునికీకరించడంతో పాటు అడ్వంచర్స్‌ను పెంచుతామన్నారు. హార్సిలీహిల్స్ ప్రైవేటీకరణ జరుగుతుందని వస్తున్న వదంతులలో నిజంలేదని, అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఒబెరాయ్ హోటల్ నిర్మాణం జరిగితే హార్సిలీహిల్స్‌కు జాతీయస్థాయి గుర్తింపు వస్తుందని ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తిరుమల కొండపై టూరిజంశాఖకు కేటాయించే ప్రత్యేక దర్శనాలను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అనంతరం బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పల్లవితో కలిసి హిల్స్‌పై నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర చైర్మన్ వెంట హిల్స్ టూరిజంశాఖ మేనేజర్ సాల్విన్‌రెడ్డి, మహేష్ తదితరులున్నారు.

స్వచ్ఛాంధ్ర ఉద్యమంలా సాగాలి

● సీఎం నారా చంద్రబాబునాయుడు



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితంలో వెలుగు నింపడమే తన బాధ్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంగా ఉద్యమంలా సాగాలని పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం మైదుకూరులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈరోజు ఒక చరిత్రకు శ్రీకారం చుట్టామన్నారు. స్వచ్ఛాంధ్ర సామాజిక సేవా కర్యాక్రమాల్లో అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉండగా 95-96లో పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునివ్వడంతో పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టామన్నారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర ఉద్యమం

ప్రతి నెల మూడో శనివారం కార్యాలయంలోని సిబ్బంది, విద్యార్థులు ప్రతి ఒక్కరు స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో పాల్గొంచుకోవాలన్నారు. కొన్ని తరాలు శ్రమపడితే తప్ప మార్పు వచ్చే అవకాశం లేదన్నారు. ప్రతి ఒక్కరు మైండ్ సెట్‌ను మార్పు చేసుకోవాలన్నారు. బాడీని కంట్రోల్‌లో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యం కలుగుతుందన్నారు. మొదట ఇళ్లు చక్కగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆ తర్వాత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలు పెద్దల్లో పర్యావరణంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించవచ్చనేది నిరూపణ చేశామన్నారు. చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో 85లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసిందన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి ఈ చెత్త ద్వారా సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను వచ్చి వెళ్లిన తర్వాత సీబీఎన్ మార్క్ కనపడాలని పేర్కొన్నారు. రాష్ట్ర మంతా స్వచ్ఛంగా ఉండాలనేదే తన ఆశయం అన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

పరిసరాల పరిశుభ్రతలో మంచి ప్రతిభ కనబరచిన పారిశుధ్య కార్మికులు చెన్నమ్మ, అమ్ములమ్మ, గంగాధర్‌తో పాటు రాష్ట్రపతి అవార్డు అందుకున్న అనకాపల్లె జిల్లాకు చెందిన పంచాయతీ కార్యదర్శి త్రినాథ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కరించారు. సీఎం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల క్యాష్ అవార్డులు కూడా ప్రకటించారు. కడపకు చెందిన అలేఖ్య మాట్లాడుతూ ఇంటి నుంచి వచ్చే చెత్తను కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి మిద్దె తోట ద్వారా కూరగాయలు పండించుకుంటున్నామన్నారు.

మైదుకూరులో మోడల్‌గా..

మైదుకూరులో మోడల్‌గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మైదుకూరులో ఏడు కిలోమీటర్ల మేర పట్టణ పరిధిలో, ఐదు కిలోమీటర్లు గ్రామీణ పరిధిలో సీసీ బీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా వందశాతం మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను తీసుకొస్తామన్నారు. డ్రైనేజీ వాటర్ శుభ్రపరిచి చెరువులు నింపే విధానాన్ని తీసుకొస్తామన్నారు. ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటుచేసే దానికోసం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అమృత్ కింద రూ.90కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు అందరికి ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. అదేవిధంగా రాయితీపై సోలార్ విద్యుత్‌ను ఏర్పాటుచేస్తామని తద్వారా కరెంట్ బిల్లులు కట్టే పరిస్థితి లేకుండా ఉంటుందన్నారు. దీపం-2 ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, మైదుకూరులో ఇంటికి పైపుల ద్వారా గ్యాస్ కనెక్షన్ ఇచ్చే పనిని కూడా చేపడుతామన్నారు.

కూటమి విజయం ప్రజలదే

గత ఏడాదిలో జరిగిన ఎన్నికల్లో కూటమికి చెందిన 93శాతం మంది అభ్యర్థులను గెలిపించిన ఘనత ఈ రాష్ట్ర ప్రజలదేనన్నారు. ఈ క్రమంలోనే కేంద్రంలో మన పరపతి పెరిగిందని రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి కోసం రూ.2200కోట్లు నిధులు కేటాయించారన్నారు. దీనితో పాటు రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు భారీస్థాయిలో నిధులు కేటాయించారన్నారు. ఎన్టీఆర్ పింఛన్ పథకం కింద ఏడాదికి రూ.33వేలకోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు.





కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతినెల మూడు శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం సంతోషకరమన్నారు. చెత్త సేకరణలో ఇప్పటి వరకు 80శాతం ప్రగతి సాధించామన్నారు. వచ్చే ఆరు నెలల్లో వందశాతం ప్రగతిని సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ వెంటిలేటర్ మీద ఉన్న రాష్ట్రాన్ని ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం ఊపిరి పోసిందన్నారు. దీనితో సంతోషంగా రాష్ట్రంలోని ప్రజలు సంక్రాతి పండుగను జరుపుకొన్నారన్నారు. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేస్తే ఈ ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టిస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, అమరావతి, పోలవరం పనులు ఊపందుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ మైదుకూరు నుంచి ఒక కార్యక్రమానికి అంకురార్పణ చేస్తున్నామన్నారు. దేశంలో ఏ ఒక్క రాష్ట్రం చేపట్టని క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని గతంలో ప్రారంభించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. స్వచ్ఛభారత్ ఏర్పాటు అయ్యాక స్వచ్ఛభారత్ అభియాన్‌కు చంద్రబాబునాయుడు నాయకత్వం వహించారన్నారు. 2047లోపు రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన వివరించారు. వెయ్యి టన్నుల చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుదాకర్‌యాదవ్ మాట్లాడుతూ మైదుకూరుకు ముఖ్యమంత్రి రావడంతో ఒక పడుగ వాతావరణం ఏర్పడిందన్నారు. వ్యాపారంలో ఉన్న తనను రాజకీయాలకు తీసుకొచ్చి ఎమ్మెల్యేను చేసిన చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటానన్నారు. రాటజలి నిర్మాణానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. బ్రహ్మంగారిమఠంను టూరిజం హబ్‌గా చేయాలని మరిన్ని నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. ముందుగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రొద్దుటూరు బద్వేలు మాజీ ఎమ్మెల్యేలు లింగారెడ్డి, విజయమ్మ, జమ్మలమడుగు, బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జిలు భూపేష్‌రెడ్డి, రితీష్‌రెడ్డి, ఆప్కో మాజీ ఛైర్మన్ గుజ్జల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, సీఎంకు సమస్యలను వివరిస్తున్న ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, స్వచ్ఛతా ర్యాలీ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 26 కేంద్రాలు
● 4242 మంది విద్యార్థులు హాజరు



మాయాబజారులోని మున్సిపల్ వివేకానంద హైస్కూల్‌లో నవోదయ పరీక్షలు రాయడానికి లోపలికి వెళుతున్న విద్యార్థులు

మదనపల్లె అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు 26 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్లు వలసపల్లె నవోదయ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేలాయుధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నిర్వహించిన నవోదయ పరీక్షలకు 5058 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 4242 మంది హాజరై పరీక్షలు రాశారన్నారు. 816 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే పరీక్షల కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతించారు. మదనపల్లెలో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలను, పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో మాయాబజార్‌లోని మున్సిపల్ వివేకానంద హైస్కూల్ ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. మయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం పురం వెంకటరమణ ఆధ్వర్యంలో నవోదయ పరీక్షలు రాసే విద్యార్థులను పరిశీలించి లోనికి అనుమతి ఇచ్చారు.

నడిరోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు

● గంటల తరబడి ట్రాఫిక్ జామ్



నిలబడిపోయిన బస్సును తోస్తున్న ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాయచోటి పట్టణం బస్టాండు వద్ద మొరాయించింది. ఈ బస్సులో దాదాపు 20 మంది ప్రయాణికులు ఉండగా బస్సు దారిలో నిలబడిపోవడంతో ఇటు నుంచి వెళ్లే వాహనాలకు చాలా ఇబ్బంది కలిగింది. ఈ బస్సు పీలేరు నుంచి రాయచోటికి వస్తుండగా ఆగిపోయినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. కాగా బస్సు కండీషన్‌ను సరిచూడకుండా ఎలా నడుపుతారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం రామును వివరణ కోరగా.. పీలేరుకు సంబంధించిన బస్సు నిలబడిపోయిన మాట వాస్తవమేనని, ఆ బస్సు చాలా రోజుల నుంచి రిపేరులో ఉందని, వీలైనంత త్వరలో తయారు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు..

● ఆర్పివేసిన స్థానికులు

సిద్దవటం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నుంచి చెన్నైకి వెళుతున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రయాణికులను ఎక్కించుకునేందుకు పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భాకరాపేటలో నిలపగా, ఒక్కసారిగా రేడియేటర్ నుంచి మంటలు రేగాయి. దీంతో డ్రైవరు బస్సు ఇంజన్‌ను ఆఫ్ చేశారు. విషయం గమనించిన స్థానికులు బిందెలతో నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనతో హైవేపై దాదాపు 20 నిముషాల పాటు వాహనాలు నిలిచిపోయారు. ఈ విషయమై ఏఎస్‌ఐ సుబ్బరామచంద్రను మాట్లాడుతూ ఈ బస్సులు 18 మంది ప్రయాణికులుండగా, వారందరినీ వేరే బస్సుల్లో గమ్యస్థానాలకు చేర్చామని తెలిపారు.

మిరప రైతు కంట కన్నీరు

● వైరస్, తెగుళ్లతో తగ్గిన దిగుబడి



కల్లంలో గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మైలవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన మిరప పంట ఈ ఏడాది రైతుకు కన్నీటిని మిగిల్చింది. వాతావరణంలో మార్పు, వైరస్, తెగుళ్లు, చీడ పీడల బెడద, మార్కెట్‌లో ధరలు తగ్గుదల వంటివి మిరప రైతుకు తీవ్ర నిరాశను మిగిల్చాయి. సాగు చేసిన మిరప పంటకు అప్పులకు వెనుకాడకుండా ముందుకు సాగి తీవ్ర నష్టాలతో మునిగామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాధారం, బోరు, బావుల కింద మండలంలో దాదాపు 3 వేల ఎకరాలకు పైగా మిరప పంట సాగైంది. తేజ రకం, నెంబరు 5 మిరప రకాన్ని ఎక్కువగా సాగు చేశారు. గత ఏడాది ఆగస్టు నుంచి మిరప పంట సాగు చేశారు. మిరప నారు నాటినప్పటి నుంచి సేద్యాలు, ఎరువులు, మందుల పిచికారి చేస్తూ పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయితే వాతావరణం మార్పులతో వైరస్ సోకడం, తెగుళ్లు, నల్లి, కాయకుళ్లు, పంటపై తీవ్ర ప్రభావం చూపింది. కాయదశలో వాతావరణం మార్పుతో కాయపై మచ్చ ఏర్పడింది. దీంతో కాయ నాణ్యత దెబ్బతిని తాలు ఎక్కువైంది. పంట కోతకు సమానంగా కల్లాల్లో కాయల గ్రేడింగ్‌కు ఖర్చు అవుతుందని మిరప రైతులు అంటున్నారు. ఈ ఏడాది మిరప పంటలో తేజ రకం ఎకరాకు 10-13 క్వింటాళ్లు, నెం.5 కూడా అంతే దిగుబడి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి ఎక్కువ కావడంతో ఎకరా మిరప పంట సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. మిరప పంట మంచి దిగుబడి, గిట్టుబాటు ధర లభిస్తే లాభాలు వస్తాయి. అయితే ప్రస్తుతం మార్కెట్ ధరలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. గత సంవత్సరం పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు అమాంతంగా పడిపోవడంతో ఎక్కువ మంది రైతులు మిరపకాయలను ఏసీ గోడౌన్లలో నిలువ చేసుకున్నారు. మంచి ధర వస్తే అమ్మాలని రైతులు ఎదురుచూస్తున్నారు. రైతుల ఆశలపై నీళ్లు చల్లేలా రోజు రోజుకు ధరలు మరింత దిగజారాయి. రెండేళ్ల క్రితం వరకు తేజా రకాలు రూ.20 నుంచి రూ.25 వేల వరకు ధర పలికాయి. ప్రస్తుతం సగం ధర కూడా అందడం లేదని రైతులు అంటున్నారు. ఈ ధరలకు పంటను అమ్మితే పెట్టుబడి ఖర్చులు కూడా రావని మిరప పంటకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



సాగుచేసిన మిరప పంట

తెగుళ్లతో మిరపకు దెబ్బ



- వెంకటేశు, రైతు

మిరప పంటలో వైరస్, వాతావరణ మార్పులతో తెగుళ్లతో తీవ్ర నష్టం వాటిల్లింది. తాలు కాయలు పెరగడంతో గ్రేడింగ్ చేసేటప్పుడు ఎక్కువగా తెల్లకాయలు వస్తున్నాయి. ఖర్చులు ఎక్కువై దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ధరలు పతనం



- జయరాం, రైతు

రెండేళ్ల క్రితం ఉన్న ధరలకు, ఇప్పటి ధరలకు చాలా తేడా ఉంది. రోజు రోజుకు ధరలు పతనమవుతున్నాయి. దీంతో ఆశించిన ఆదాయం వస్తుందో.. రాదో.

మీ కుటుంబంలో ఒక్కడిలా ఆదరించారు

● సినీనటుడు కిరణ్ అబ్బవరం



డ్యాన్స్ చేస్తున్న కిరణ్ అబ్బవరం, రుక్సార్ ధిల్లాన్

కురబలకోట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మీ కుటుంబంలో సొంతమనిషిలా ఆదరించారు. మీరు చూపిన ఆదరాభిమానాలు తన జీవితంలో వెలకట్టలేనివని సినీ నటుడు కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో దిల్ రుబా సినిమాకు డైరెక్టర్ విశ్వకరుణ్, హీరో హీరోయిన్లుగా కిరణ్ అబ్బవరం, రుక్సార్ ధిల్లాన్ నటించిన ఈ చిత్రం పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన నిజ జీవితంలో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాన్ని సాధించడానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా ప్రతిఒక్కరి జీవితంలో సాధించాలనే పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. చదువులో ఇంజనీరింగ్ పూర్తి చేసి, సినీ రంగంలో రాణిస్తున్నానన్నారు. మదనపల్లెతో తనకు విడదీయరాని అనుబంధం ఉన్నదని, పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు, ఇక్కడికి సినిమాలు చూడటానికి, షాపింగ్ చేయడానికి తరచూ వచ్చేవాడినన్నారు. తాను బెంగళూరులో ఉద్యోగం చేసేటప్పుడు ఈ మార్గంలో ద్విచక్రవాహనంలో వెళ్లేవాడినన్నారు. ఈ సినిమాలో రాయలసీయ ప్రాంతానికి చెందిన వారు నటించారని, ఇప్పటికే ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నదని, సినిమాను ఫిబ్రవరి 14న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నామని చూసి ఆదరించాలని కోరారు. అనంతరం సినిమాలోని సాంగ్‌కు హీరో, హీరోయిన్‌తో పాటుగా మిట్స్ విద్యార్థులు డ్యాన్సులు వేసి పలువురిని ఆకట్టుకున్నారు. అలాగే విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేసి యువతను ఆకట్టుకున్నారు. అనంతరం వచ్చే నెలలో మిట్స్‌లో నిర్వహించే అశ్వ కార్యక్రమానికి సంబంధించి టీజర్‌ను హీరో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, వైస్ ప్రిన్సిపాల్ కమాల్‌బాషా, రామనాథం తదితరులు అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

పుల్లంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై పుల్లంపేటకు చెందిన నవీన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం ఉపాధిహామీ ఏపీడీ ప్రతాప్ విచారణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో ఫిర్యాదుదారు. ఫీల్డ్ అసిస్టెంట్ సమక్షంలో విచారణ చేశారు. పుల్లంపేటకు చెందిన జె.ఉమ, ఆమె కుమారుడు దినేష్, ఉపాధి పనులకు వెళ్లకపోయినా, వారి పేరుతో కూలి మంజూరు కావడంతో వారిని కూడా విచారణ చేశారు. తమకు జాబ్‌కార్డులు ఉన్నట్లే తెలియదని, తమ కుమారుడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని, నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు లిఖిత పూర్వకంగా ఏపీడీకి ఫిర్యాదు చేశారు. వలంటీర్ మాధవి ఉపాధి పనులకు వెళ్లినట్లు ఫిర్యాదులో ఉండడంతో ఆమెను కూడా పిలిచి విచారణ చేశారు. వలంటీర్ విధులు ఉన్న రోజుల్లో తప్ప, మిగతా రోజుల్లో ఉపాధి పనికి వెళ్లవచ్చని, అలా కాకుండా అన్ని రోజులు ఉపాధి కూలీగా పనిచేసినట్లు ఉంటే రికవరీ చేస్తామని ఏపీడీ తెలిపారు. ఇలాంటి ఫిర్యాదులు నిర్ధారణ అయిన సందర్భాల్లో, వలంటీర్ నుంచి రికవరీ చేసి, ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించామన్నారు. ఒకే రేషన్‌కార్డులో ఉన్న దంపతులకు రెండు వేర్వేరు ఐడీలు నమోదు చేసి నిధులు దుర్వినియోగం చేసిన అంశంపై కూడా ఏపీడీ విచారణ చేశారు. రికార్డులు పరిశీలించి నివేదికను అధికారులకు పంపుతామని ఏపీడీ తెలిపారు. ఈ విచారణలో ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమాలపై విచారణ చేస్తున్న ఏపీడీ

హోరాహోరీగా సబ్‌జూనియర్ హాకీ టోర్నమెంట్



హాకీ టోర్నమెంట్ సెమీ ఫైనల్లో తలపడుతున్న కడప, తిరుపతి జట్లు

మదనపల్లెటౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో నిర్వహిస్తున్న అంతర్‌జిల్లా సబ్‌జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో హోరాహోరీగా వివిధ జిల్లాల జట్లు తలపడ్డాయి. శనివారం లీగ్ దశల్లో ప్రీ క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించగా నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. ఇందులో తొలి సెమీఫైనల్లో తిరుపతి జట్టుపై కడప జట్టు 4-1 గోల్స్ చేసి ఫైనల్స్‌కు చేరుకుంది. అంతకు ముందు క్వార్టర్ ఫైనల్స్‌లో మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో కాకినాడపై కడప జట్టు, రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై తిరుపతి జట్టు, మూడో క్వార్టర్ ఫైనల్స్‌లో వెస్ట్ గోదావరి జట్టుపై అన్నమయ్య జిల్లా జట్టు, నాలుగో క్వార్టర్ ఫైనల్స్‌లో చిత్తూరు జట్టుపై అనకాపల్లె జట్టు గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజ్, కోశాధికారి థామస్, జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్, శివప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


బారెడ్డి ఓబుల్‌రెడ్డి మృతదేహం

చెన్నూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతు బారెడ్డి ఓబుల్‌రెడ్డి (50) వ్యవసాయంలో అప్పులు పెరిగి, వత్తిళ్లు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఉప్పరపల్లె వాసి ఓబుల్‌రెడ్డి కొన్నేళ్లగా స్వగ్రామంలోనే వ్యవసాయం చేసేవాడు. పరిస్థితులు అనుకూలించ కపోవడం, పంట చేతికి అందకపోవడం, అప్పులకు వడ్డీ పెరగడం, వత్తిడి తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. రోజూ అప్పుల వారి వత్తిల్లు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులతో చెప్పి మదనపడేవాడు. దీంతో ఆరోగ్యం కూడా దెబ్బతినింది. చివరికి ఆత్మహత్యే శరణ్యమనుకుని శుక్రవారం పెండ్లిమర్రి మండలం ఆరవేటిపల్లిలో మరదలు ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. చీకటి పడ్డా కూడా ఇంటికి రాకపోవడంతో భార్య తులశమ్మ, కుమారుడు, కుమార్తె ఫోను చేశారు. ఎలాంటి సమాధానం రాకపోవడంతో వారు ఆందోళనకు గురయ్యారు. శనివారం ఉదయం హైవేలోని హజ్‌హౌస్‌కు దక్షిణ వైపు ఉన్న పాత అన్నక్యాంటిన్‌లో పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడని కనుగొన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి

డాక్టరు నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు


రామయ్య మృతదేహం

పోరుమామిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రామాయపల్లె వాసి కారు రామయ్య (45) వైద్యం వికటించి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రామయ్య మృతికి డాక్టరు నిర్లక్ష్యమే కారణమన్నారు. గురువారం రాత్రి రామయ్య కడుపు, ఛాతిలో మంటగా ఉందని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పోరుమామిళ్లలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టరు అన్ని వివరాలు కనుక్కుని కడుపులో గ్యాస్ ఉందంటూ ఇంజక్షన్, ట్యాబ్లెట్లు, సిరప్ ఇచ్చాడు. తరువాత ఇంటికి వెళ్లిన రామయ్యకు వాంతులు ఎక్కువ కావడం, అస్వస్థతకు గురవడంతో కుటుంబీకులు మళ్లీ ఆస్పత్రికి తీసుకునివచ్చారు. డాక్టరు ఎంతసేపటికీ స్పందించకపోగా, చివరికి డాక్టరు పరీక్షించే సమయానికి అతను మృతి చెందాడని ధృవీకరించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టరు నిర్లక్ష్యమే కారణమని, ఆస్పత్రి ఎదురుగా ఉన్న పోలీసులకు తెలిపారు. రామయ్య శవంతో రాత్రి నుంచి ఉదయం వరకు ఆస్పత్రిలోనే బైఠాయించారు. శుక్రవారం మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్‌ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ - ఒకరు మృతి


బాదుల్లా మృతదేహం

పెండ్లిమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప-పులివెందుల ప్రధానరోడ్డులో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బాదుల్లా (50) మృతిచెందాడు. మిట్టమీదపల్లె వాసి బాదుల్లా 40ఏళ్లుగా చుట్టుపక్కల ప్రాంతాల్లో పరుపులు అమ్ముతూ, కుడుతూ జీవించేవాడు. రోజువారి పని నిమిత్తం వ్యాపారం చేసుకుని ఆటోలో జంగంరెడ్డిపల్లె, రంపతాడు రహదారి నుంచి కడప-పులివెందుల మెయిన్‌రోడ్డు ఎక్కుతుండగా పులివెందుల నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆటోపల్టీలు కొట్టి అందులో ఉన్న బాదుల్లాకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన కడప రిమ్స్‌కు 108లో తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు.

డ్రాఫ్టరూల్స్ అసంబద్ధాలను తొలగించాలి

- ఆర్జేడీకి పీఎస్‌టీయూ వినతి


ఆర్జేడీకి వినతిపత్రం సమర్పిస్తున్న పీఎస్‌టీయూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బదిలీలు, రేషనలైజేషన్ చట్టబద్ధత డ్రాఫ్ట్ రూల్స్‌లోని అసంబద్దాలను తొలగించాలని లేకపోతే వేలాదిగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సర్‌ప్లస్ అవుతారని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జమాల్‌రెడ్డి కోరారు. శనివారం కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ 6,7,8 తరగతుల సెక్షన్ల విషయంలో ప్రస్తుతం విడుదల చేసిన డ్రాఫ్ట్ రూల్స్‌లో తీవ్ర అన్యాయం జరుగుతోందని వివరించారు. కేవలం ఆరుగురు విద్యార్థుల తేడాతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక పాఠశాలలో మూడు సెక్షన్లు తగ్గి వేలాది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ అవుతారన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీపీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, రామలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

టీచర్ల పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి

జడ్పీ సీఈఓకు ఏపీటీఎఫ్ వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది ప్రావిడెంట్ ఫండ్ వార్షిక వివరాల స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబుళమ్మను కలిసి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులు 2023-24 పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, పీఎఫ్ నెలవారీ జమలను ఆన్‌లైన్‌లో ఉంచాలని, పీఎఫ్ రుణాలను, ఫైనల్ పేమెంట్లను మంజూరు చేయడంలో జాప్యం లేకుండా చూడాలని, ఉన్నత పాఠశాలల్లోని నాన్‌టీచింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, టీచర్ల ఖాతాల కు జమకాని డీఏ మొత్తాలను వారి అకౌంట్లలో జమచేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

కారు కాల్చిన సంఘటనపై కేసు నమోదు

రాయచోటిటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్డీస్‌కాలనీలోని ఎర్ర మసీదు వద్ద శనివారం తెల్లవారుజామున కారును కాల్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... ఎర్రమసీదు ప్రాంత వాసి అఫ్సాన్‌పై జాహిద్ సహా మరికొందరు దాడి చేసి గాయపర్చారు. మిత్రుడు అఫ్సాన్‌పై ఇస్రాన్ రెండు రోజుల కిందట దాడి చేయించాడని అనుమానించిన నాసిర్ అలియాస్ డాకు, అబూజర్, గౌర్ మరొకరితో కలిసి శనివారం తెల్లవారుజామున ఎర్ర మెసేజ్ సమీపంలో తన ఇంటి ముందు నిలిపి ఉన్న స్కోడా కారుపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. దీంతో బాధితుడు ఇస్రాన్ శనివారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అర్బన్ సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జహీర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కారు దగ్ధం చేసిన గంజాయి బ్యాచ్ గతంలో కూడా చార్మినార్ హోటల్, అరేబియన్ హోటల్ ఎదురుగా స్పోర్ట్స్ సెంటర్, మయూర బేకరీ బిల్డింగ్ యజమాని రబ్బానిపైన, కొత్తపేట టాటూ సెంటర్‌పై సంఘటనలకు పాల్పడినట్లు సమాచారం.

నిధులొచ్చినా తప్పని అడ్డంకులు

'నాలుగులేన్ల' నిర్మాణానికి అటవీ అనుమతులు ?

ఆటంకాలు తొలిగేదెన్నడు? ● రైతులకు పరిహారం అందేదెప్పుడు


ఎరసాల మీదుగా వెళ్లే రసాపేట - కొత్తపల్లె నాలుగులేన్ల రోడ్డు

పోరుమామిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి మైదుకూరుకు తక్కువ దూరం, వేగంగా ప్రయాణించేందుకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణానికి మైదుకూరు నుంచి సీతారాంపురం వెళ్లే దారిలో జిల్లాసరిహద్దు వరకు రైతుల స్థల సేకరణ చేసింది. వారికి అవార్డు మంజూరైనా కొందరు రైతులకు రికార్డులు సరిగా లేకోవడంతో కొందరికి నష్టపరిహారం అందింది, మరికొందరికి డబ్బు అందాల్సి ఉంది. ఆర్డీఓ వెరిఫికేషన్ అయిన తరువాత వారికి అందే అవకాశాలున్నాయి. కానీ ఈ నిర్మాణం గతేడాది అక్టోబరులో ప్రారంభమైంది. 2026 ఏప్రిల్‌కు పూర్తిచేయాల్సి ఉంది. ఈ నిర్మాణం పూర్తయితే విజయవాడ - సింగరాయకొండకు, నేరుగా బెంగుళూరు నుంచి మైదుకూరుకు తక్కువ సమయంలో వెళ్లేందుకు అంచనాలు వేసి దాదాపు రూ.189 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఎద్దులాయపల్లె నుంచి సీతారాంపురం వరకు రోడ్డు విస్తరణ పనులు జరగాల్సి ఉంది. ఇందులో సీతారాంపురం వద్ద ఏడున్నర కిలోమీటర్లు అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. టేకూరుపేట చెక్‌పోస్టు నుంచి జిల్లా సరిహద్దు వరకు అనుమతులు ఇంకా రావాల్సి ఉంది. రంగసముద్రం బైపాస్ 1.8 కిలోమీటర్లు పెండింగులో ఉంది. ఇందులో రైతులకు నష్టపరిహారం అందాల్సి ఉండగా, రికార్డులు అందిస్తే ఆర్డీఓ వెరిఫికేషన్ అయిన తరువాత వీరికి పరిహారం అందే అవకాశం ఉంది. టేకూరుపేట నుంచి రజాసాహెబ్‌పేట వరకు ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. నర్సింగ్‌పల్లె నుంచి రంగసముద్రం వరకు నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ రోడ్డు విస్తరణకు సంబంధించి 38.12 ఎకరాలు సంబంధించి 397 మంది రైతులకు ప్రభుత్వం రూ.9,92,40,120 అవార్డు ప్రకటించింది. కాశినాయన మండలానికి సంబంధించి 6.81 ఎకరాలకు 56 మంది రైతులకు రూ.86,80,251 అవార్డు ప్రకటించింది. బి.కోడూరు మండలానికి సంబంధించి 2.44 ఎకరాలకు సంబంధించి 44 మంది రైతులకు రూ.27,99,460లు అవార్డు ప్రకటించింది. పోరుమామిళ్ల మండలానికి సంబంధించి 16.54 ఎకరాలకు సంబంధించి 55 మంది రైతులకు రూ.3,61,16,678లు అవార్డు ప్రకటించింది. బి.మఠం మండలానికి సంబంధించి 12.33 ఎకరాలకు 242 మంది రైతులకు రూ.5,16,43,731లు అవార్డు ప్రకటించింది. ఇంకా ఇప్పటికీ 351 మంది రైతులకు రూ.7,62,96,346లు నష్టపరిహారం అందాల్సి ఉంది. ఈ రైతులకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేసి ప్యాకేజీ పొందాల్సి ఉంది. ప్రస్తుతం టేకూరుపేట చెక్‌పోస్టు సమీపంలో రజాసాహెబ్‌పేట నుంచి ఎరసాల మీదుగా అర్త్ వరకు నిర్మాణం జరుగుతున్నాయి. మధ్యలో బ్రిడ్జిల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి 10 శాతమే పనులు జరిగాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రైతులకు సంబంధించి పూర్తిగా నష్టపరిహారం అందించి నిర్మాణం వేగవంతం చేస్తే భవిష్యత్తులో మైదుకూరు నుంచి విజయవాడకు వెళ్లాలన్నా ఈ రహదారి సింగరాయకొండ మీదుగా విజయవాడ వెళ్లేందుకు విజయవాడ నుంచి మైదుకూరుకు అతి తక్కువ సమయం పట్టే అవకాశాలున్నాయి. ఈ వేసవిలో కల్లా అర్త్ పని పూర్తయితే వచ్చే కాలానికి పనులు మరింత వేగం అందుకోవచ్చు. గ్రావెల్‌కు సంబంధించి నీళ్లు చల్లాలని కొందరు చెబుతున్నారు. ఈ విషయం సంబంధిత శాఖ ఏఈ రామక్రిష్ణనాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో నీళ్లు చల్లుతున్నామని, దుమ్ము రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పనుల విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటే పనులు వేగంగా జరిగి ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.




నాలుగులేన్ల రహదారిపై బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు చేసిన దృశ్యం - మోరీలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం - టేకూరుపేట చెక్‌పోస్టు వద్ద జరుగుతున్న బ్రిడ్జిల నిర్మాణం

రెడ్లు సేవాతత్పరులు

రెడ్డి సేవాసమితి సేవలు ప్రశంసనీయం
రజతోత్సవాల్లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి



రెడ్డి సేవాసమితి రజతోత్సవాల్లో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి

కడప కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రెడ్లు సేవాతత్పరులని, వివిధ రంగాల్లో ప్రశంసనీయమైన సేవలందిస్తూ సాగుతున్న రెడ్డిసేవా సమితి సేవలు ప్రశంసనీయమని ఏపీ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి కొనియాడారు. రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక డీఎస్ఆర్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సమితి రజతోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ ప్రోలయ వేమారెడ్డి మొదలుకుని నేటి వరకు అనేక మంది రెడ్లు దేశానికి సేవలందించారన్నారు. తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మొదలుకుని తెలుగు నేలపై 11 మంది రెడ్లు ముఖ్యమంత్రులుగా సేవలందించారన్నారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాధరెడ్డి, మాట్లాడుతూ జిల్లాలో విశ్వవిద్యాలయానికి వైవీయూ పేరు పెట్టడం గర్వకారణమన్నారు. పది మందికి అన్నం పెట్టే గుణం రెడ్లకుందని, ఆ దిశగా సేవలందిస్తున్న రెడ్డి సేవా సమితి ఏర్పడడం రెడ్లకు తోడ్పాటన్నారు. రెడ్డిసేవా సమితి అధ్యక్షుడు ఆచార్య కుప్పిరెడ్డి నాగిరెడ్డి, వైవీయూ సహాచార్యులు కొవ్వూరు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాతికేళ్లుగా విద్యావసతిని కల్పించి ఎందరో విద్యార్థినులకు ఆశ్రయం కల్పిస్తున్న రెడ్డిసేవాసమితి సేవలు అభినందనీయమన్నారు. హంస అవార్డు గ్రహీత డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవాసమితి అభ్యుదయం దిశగా సేవలందించడం వెనుక నిర్వాహకుల కృషిని కొనియాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు రేపటి సమాజానికి మార్గదర్శకాలన్నారు. అతిధులను, మేలుకొలుపు సంపాదకులు డాక్టర్ భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కొండూరు జనార్ధనరాజు, చదలవాడ వెంకటేశ్‌ను రెడ్డి సేవా సమితి నిర్వాహకులు సత్కరించారు. మేలుకొలుపు సంచిక అతిధులచే ఆవిష్కరించబడింది. ప్రముఖ రచయిత పుత్తాపుల్లారెడ్డి రచించిన మహాభారత విజ్ఞాన సర్వస్వం పుస్తకాన్ని ఆవిష్కరించి పుల్లారెడ్డికి సాహిత్య రత్నాకర బిరుదు ప్రదానం చేశారు. ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ప్రముఖ జానపద పరిశోధకులు ఆచార్య చిగిచెర్ల క్రిష్ణారెడ్డి, కొండా లక్ష్మీకాంతరెడ్డి, యలమర్తి మధుసూదన్, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, గుడ్ల ఆదినారాయణరెడ్డి పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

200 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ ద్వారా 200 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కమలాపురం రైతుల అవసరాల దృష్ట్యా ఈ నీటిని వదులుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 24.34 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పారా స్పోర్ట్స్‌ను విజయవంతం చేయండి

కడప స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రవీంద్రనగర్‌లోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ క్రీడల్లో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 28న ఉదయం 10గంటల నుంచి మున్సిపల్ మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఔత్సాహిక విభిన్న ప్రతిభావంతులు హాజరవాలని కోరారు. రన్నింగ్‌రేస్, త్రోబాల్ తదితర విభాగాల పోటీలు జరగనున్నాయన్నారు. వివరాలకు 9000672017, 9550878889, 9963194010 సంప్రదించాలన్నారు.

ప్రాణం తీసిన హెర్నియా ఆపరేషన్

సినిమాటిక్‌ను ప్రదర్శించిన డాక్టర్ ● ఆపరేషన్ సక్సెస్ అంటూ నమ్మబలికిన వైనం
ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన ● రెండుగంటలు ట్రాఫిక్ జామ్
● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం




కేవీఆర్ హాస్పిటల్ వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు - ఐసీయూలో రమాదేవి మృతదేహం

ప్రొద్దుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హెర్నియా ఆపరేషన్ మహిళ ప్రాణం తీసింది. అయితే ఆపరేషన్ సక్సస్ అయిందని, పేషెంట్‌ను అబ్జర్వేషన్‌లో ఉంచాలని డాక్టర్ నమ్మబలుకుతూ సినిమాటిక్‌ను ప్రదర్శించారని, డాక్టర్ ప్రదీప్‌రెడ్డిని శిక్షించాలని బాధిత గ్రామస్తులు హాస్పిటల్ వద్ద నినాదాలు చేశారు. చివరికి పోలీసుల జోక్యంతో సర్దుబాటైంది. వివరాల్లోకెళితే...

ఎర్రగుంట్ల మండలం తుమ్మల పల్లెకు చెందిన వడ్డెరపు రమాదేవి హెర్నియా సమస్యతో జనవరి 16న గాంధీరోడ్డులోని కేవీఆర్ హాస్పిటల్‌లో చేరారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు హెర్నియా ఆపరేషన్ చేయాలని తెలిపారు. దీంతో వారు ఆపరేషన్‌కు సిద్దపడ్డారు. జనవరి 17న ఆపరేషన్ చేసి సక్సెస్ అయ్యిందని వైద్యులు తెలిపినట్లు రమాదేవి భర్త శ్రీనివాసులు వెల్లడించారు. అయితే రమాదేవిని ఐసీయూలో అబ్జర్వేషన్‌లో వుంచామని ఆమె ఆరోగ్యంగా వుందని నమ్మబలికారన్నారు. కానీ శనివారం ఉదయం నుంచీ ఆమెను చూసేందుకు అనుమతించమని కోరినా వారు చూపించకపోవడంతో రమాదేవికి ఏదో అయిందనే అనుమానం వచ్చిందన్నారు. దీంతో బంధువులు, ఊరి వారిని ఆస్పత్రి వద్దకు రావాలని చెబుతుండగానే ఆస్పత్రికి పోలీసులు వచ్చారన్నారు. అంతేకాకుండా ప్రైవేటు వ్యక్తులు పెద్దఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకున్నారన్నారు. దీంతో రమాదేవి మరణించిందని ఖరారు చేసుకున్నామన్నారు. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వచ్చాక ఆయనతో పాటు మమ్మల్ని లోపలికి అనుమతించారన్నారు. ఆస్పత్రిలో రమాదేవి ఆపరేషన్ తరువాత మరణించడంపై కనీసం సమాచారం కూడా ఇవ్వని డాక్టర్, ఆస్పత్రి సిబ్బందిపై త్రీటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా కనీసం ఫిర్యాదు స్వీకరించలేదని రమాదేవి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. రమాదేవికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వున్నాడని, భర్త జువారి ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడని మృతురాలి బంధువులు తెలిపారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున ఆందోళనలో డిమాండ్ చేశారు.

మహిళ మృతిపై కేవీఆర్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ప్రదీప్‌రెడ్డిని వివరణ కోరగా పేషంట్ రమాదేవి హెర్నియా సమస్యతో కడుపు నొప్పితో బాధపడుతూ వచ్చిందన్నారు. ఆమెకు చాలాకాలంగా హెర్నియా వుందని అనేకసార్లు స్కానింగ్ చేయించిన హిస్టరీ మాకు వారు తెలపలేదు. పరిస్థితి చూసి ఆమెకు ఆపరేషన్ చేయాలని కుటుంబసభ్యుల అనుమతి తీసుకోని చేశాం. దాదాపు మూడున్నర గంటల పాటు కష్టపడి ఆమెకు ఆపరేషన్ చేశాం. లోపల ప్రేవులు చాలా మడత పడ్డాయి. ఆపరేషన్ మాత్రం సక్సెస్ అయ్యింది. తరువాత ఆమెకు బీపీ పల్స్ డౌన్ అయ్యి శాచురేషన్ పాయింట్‌లు పడిపోయాయి. సీపీఆర్‌చేసి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశాం కానీ ఫలితం లేకుండాపోయింది.

ఉరివేసుకుని వ్యక్తి మృతి

పెండ్లిమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాచునూరు వాసి మాచునూరు శ్రీనివాసులు (37) శుక్రవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు శ్రీనివాసులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. శుక్రవారం రాత్రి మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిదీ..

● జేసీ ఆదర్శరాజేంద్రన్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్



రైల్వేకోడూరు చీపురు పట్టి చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్



రాజంపేట: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ర్యాలీలో సబ్‌కలెక్టర్ నిదియాదేవి తదితరులు



కలెక్టరేట్ ఆవరణలో పరిసరాలు శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

రైల్వేకోడూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రైల్వేకోడూరులో ర్యాలీ నిర్వహించారు. ఎర్రచందనం పార్కులో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. డీఎఫ్‌వో జగన్నాథ్ సింగ్, తహసీల్దార్ మహబూబ్ చాంద్, రేంజర్ శ్యాంసుందర్, ఎంపీడీవో నాగార్జునరావు, హౌసింగ్ ఏఈ మురళీకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్యమ్మ, వెలుగు ఏపీవో వసుంధర, ఆర్ఐ లక్ష్మీదేవి, ఉపాధి ఏపీవో మృత్యుంజయరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, వెంకటేశ్, మణి, చంద్రశేఖర్, జనసేన యువ నాయకులు ముత్యాల కిశోర్, టీడీపీ యువ నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, మల్లెం హేమంత్‌కుమార్, పఠాన్ మౌలా, జుబేర్, సర్పంచ్ బుడిగి శివయ్య, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్‌రావు, సురేశ్‌రాజు పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేటలో సబ్‌కలెక్టర్ నిదియాదేవి ఆధ్వర్యంలో రాజంపేట మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, మండల టీడీపీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి రెడ్డయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. అన్నమాచార్య ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ నిదియాదేవి మాట్లాడుతూ పరిశుభ్రత కేవలం ఒక బాధ్యత కాదని, ఇది మన జీవన విధానమని పరిశుద్ధమైన వాతావరణం కోసం మనందరం పాటుపడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడంలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, ఆసుపత్రి సిబ్బందితో పరిసరాలను పరిశుభ్రం చేశారు.

రాయచోటి కలెక్టరేట్: రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో కలెక్టరేట్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో చెత్త ఊడ్చి శుభ్రం చేశారు. డీఎస్‌వో, ట్రెజరీ, ల్యాండ్ అండ్ సర్వే కార్యాలయం వారు స్వచ్ఛందంగా సేవలో పాలుపంచుకున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శనివారం సుండుపల్లె మండలంలోని దూది మాదిగపల్లెలో రూ.5 లక్షలతో, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వీధిలో రూ.7 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మొదటి విడతగా జిల్లాలోని 30 మండలాల్లో పనులు ప్రారంభమయ్యాయని, కొన్ని చోట్ల సీసీ రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప, శివరాంనాయుడు, ప్రసాద్‌రాజు, సురేశ్‌నాయుడు, జనార్దన్, మంగిరి సురేశ్‌బాబు, సర్పంచ్ షరీఫ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు బెల్లాల రమణయ్య, మోహన్‌బాబు నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, బీజేపీ నాయకులు వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై అభ్యంతరాలుంటే తెలపండి

రామాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల వర్గీకరణపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20న చిత్తూరులో రాజీవ్ మిశ్రా కమిటీ దృష్టికి తీసుకెళ్లవచ్చని అన్నమయ్య జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకట్రమణ తెలిపారు. రామాపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కులాల వర్గీకరణపై ఆయా కులాల వారిని విచారణ చేసేందుకు ప్రభుత్వం రాజీవ్ మిశ్రా కమిటీని నియమించిందన్నారు. ఈ కమిటీ ఈ నెల 20న చిత్తూరు జిల్లాలో పర్యటిస్తుందని, అన్నమయ్య జిల్లాలోని ఎస్సీ కులాల వారు తమ అభ్యంతరాలను రాత పూర్వకంగా కమిటీకి తెలపాలని సూచించారు.'

'సచివాలయ ఉద్యోగుల' క్యాలెండర్ విడుదల

సంబేపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ పోస్టల్ క్యాలెండర్‌ను ఎంపీడీవో రామచంద్ర, ఎంఈవో శ్రీనివాసులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు డీ. వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా ఉద్యోగుల ఉమ్మడి సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి, అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, కడప జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షులు హీరామియా, ఏపీఎం సంజీవరాజు, వ్యవసాయ అధికారి కిశోర్‌నాయక్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, మండల, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యానికి ప్రభుత్వం పెద్దపీట

రైల్వేకోడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సీడీపీవో సౌభాగ్యమ్మ, వెలుగు ఏపీవో వసుంధర తెలిపారు. నైపుణ్య దినోత్సవం సందర్భంగా శనివారం గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. టైలరింగ్‌లో మంచి ఆదాయం ఉందన్నారు. శిక్షణ లో నేర్చుకున్న అంశాలే కాకుండా, వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని తెలిపారు. ఎ. ఏసీడీపీవో టి. సరళాదేవి మాట్లాడుతూ మహిళలు వృత్తి నైపుణ్యంతో పాటు బాల్య వివాహాలను అడ్డుకోవాలని తెలిపారు. గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కే. పార్థసారథి మాట్లాడుతూ అధునాతన టైలరింగ్, బోటిక్ నిర్వహణ కోర్సును మహిళలకు అందిస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు వీలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ పల్లవి, లహరి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 19 మంది గైర్హాజరు

సిద్దవటం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం అట్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలకు చెందిన విద్యార్థులు జవహర్ నవోదయ పరీక్షలు రాశారు. పరీక్ష ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ 163 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 144 మంది హాజరయ్యారని, మండల ఇన్‌చార్జి తహసీల్దారు తనిఖీలు చేశారన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

సంబేపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోరం లేకపోవడంతో శనివారం జరగాల్సిన సంబేపల్లె మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, సమావేశానికి ఒకరు మాత్రమే హాజరై నట్లు తెలిపారు. దీంతో సమావేశాన్ని ఆదివారానికి వాయిదా వేస్తున్నట్లు వివరిం చారు. ఆదివారం కూడా సభ్యులు సమావేశానికి హాజరుకాకపోతే తిరిగి 90 రోజులలోపు మండల అధ్యక్షుడిని సంప్ర దించి సమావేశాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు.

కాపు సంఘం కార్యదర్శిగా రామా శ్రీనివాసులు



రాజంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కాపు సంఘం రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శిగా రామా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ల మురళీకృష్ణనాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామా శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో కాపుల అభ్యున్నతికి అన్నివిధాల కృషి చేస్తానన్నారు. జాతీయ కాపు సంఘం నిబంధనల మేరకు పని చేస్తూ కాపుజాతి ఉన్నతికి పాటు పడతానన్నారు.

యుగ పురుషుడు ఎన్‌టీఆర్



అన్నదానం చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం



రైల్వేకోడూరు: ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

రాజంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. పేదలకు అల్పాహారం అందించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, టీడీపీ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, రాజంపేట మండలపార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షులు డీఆర్ఎల్ మణి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణచౌదరి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బాపనయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరనాయుడు, మేకా నరసింహులు, చెంగల్ రాయుడు, మైనార్టీ నాయకులు షామీర్‌బాషా, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, మలిశెట్టి సుబ్బరాయుడు, ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. వైబీఎన్‌పల్లెలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం నాయుడు,శివనారాయణచౌదరి, మహేంద్రనాయుడు, జయరామయ్యనాయుడు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఒంటిమిట్టలోని . కోదండ రామాలయ వెనుక భాగంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు.

రైల్వేకోడూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో కడప అర్బన్ అథారిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జనసేన ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చిట్వేలికి చెందిన వేణు అనే వ్యక్తి 107వ సారి రక్తదానం చేశాడు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిట్వేలి : యువ నాయకుడు కాకర్ల నాగార్జున ఆధ్వర్యంలో కూటమి నేతలతో కలిసి కొత్త బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీరబల్లి:మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్ రాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు

సంబేపల్లె: టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్, క్లస్టర్ ఇన్‌చార్జి మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

గాలివీడు: స్థానిక నాలుగురోడ్ల కూడలిలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి సర్పంచ్ పార్థసారథి రెడ్డి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసిశ్రద్ధాంజలి ఘటించారు.

నందలూరు: బస్టాండు కూడలిలో మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య ఆధ్వర్యంలో ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, పల్లె సుబ్రమణ్యం తదితరులు నివాళులర్పించారు.

పుల్లంపేట: ఎన్టీఆర్ విగ్రహానికి పాలతో అభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్ర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు తోపిరెడ్డి రవీణ్‌కుమార్‌రెడ్డి బి ఎర్రగుడి గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం, లక్కిరెడ్డిపల్లె టీడీపీ కార్యాలయంలో నివాళులర్పించారు.

ఒంటిమిట్టలో ఎమ్మెల్సీ రామచంద్రయ్య పూజలు



ఒంటిమిట్ట ఆలయంలో ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య దంపతులు

రాజంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరామాలయంలో శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ చెన్నంశెట్టి రామచంద్రయ్య పూజలు నిర్వహించారు. కోదండరామాలయ అతిథిగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి బస చేసిన ఆయన శనివారం వేకువ జామున కోదండరాముడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కలుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, మండల టీడీపీ నాయకులు ఆర్.బాలమునెయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో యువతకు ప్రోత్సాహం

సిద్దవటం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గాంధీ వీధిలో శుక్రవారం రాత్రి పేపర్ ప్లేట్ల నూతన తయారీ కేంద్రాన్ని ఉమ్మడి కడపజిల్లా జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంఉపాధి రంగాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఓబులయ్య, ఎస్ఆర్ఐ చంద్ర, గంజి సుబ్బరాయుడు, శ్రీకాంత్, విజయ్, పసుపులేటి గంగయ్య, ఎ.చిన్నవెంకటయ్య, మహబూబ్ బాషా, కూటమి నేతలు పాల్గొన్నారు.

'గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు'



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో బెల్టు షాపులు దర్శనమిస్తున్నా ఎక్సైజ్ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు ఆరోపించారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి పల్లెలోను రెండు బెల్టుషాపులు ఉన్నాయని, ప్రతి గ్రామంలోను మద్యం ఏరులైపారుతోంద న్నారు. ఇందుకు ఎక్సైజ్ అధికారుల అండదండలున్నాయన్నారు. ఆయా అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బాలల సంరక్షణకు కొత్త నిబంధనలు



బాలసదనంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి); బాలల సంరక్షణకు ప్రభుత్వం కొత్త నిబంధనలు తెస్తోందని, ప్రతి బాలసదనం తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని జిల్లా బాలల పరిరక్షణ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక బాల సదనాన్ని, వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, రాయచోటి, మదనపల్లెల్లోని చిల్డ్రన్ హోంలను రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలసదపంలో చదివే అనాథ పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం కొత్త ప్రణాళిక తయారు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో సీడీపీవో పద్మావతి, చిల్డ్రన్ ప్రొటెక్షన్ అధికారులు రవికుమార్, రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలకు బీజేపీ నేత పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న బీమిశెట్టిని సత్కరిస్తున్న నాగోతు రమేష్‌నాయుడు

రాజంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాక నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు బీమిశెట్టి వెంకటేశ్వర్ రావును శనివారం రాజంపేటలో పలువురు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. బీజేపీ నేత నాగోతు రమేస్‌నాయుడు, మహిళా నేత మిరియాల సురేఖ, టీడీపీ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అన సూయమ్మ, లయన్స్‌క్లబ్ సభ్యులు కుమార స్వామి తదితరులు బీమిశెట్టి వెంకటేశ్వర్‌రావుకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

సిద్దవటం: స్థానిక లక్ష్మీవెంకటేశ్వర దేవస్థానం నుంచి సుమారు 300 మంది గోవింద భక్తులు గురుస్వామి వెంకటరమణ ఆధ్వర్యంలో కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం

రాజంపేట టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో శనివారం గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలు ఘనంగా న్విహించారు. పట్టణంలో మహిళలు పాతబస్టాండు నుంచి గొబ్బెమ్మ పాటలు పాడుతూ వేడుకలు నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు గొబ్బిళ్ల తడుతూ పూజించుకున్నారు. పోలిచెరువులో నిమజ్జనం చేశారు.

అట్టహాసంగా సుగవాసి ప్రసాద్‌బాబు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి ప్రసాద్‌బాబుకు తినిపిస్తున్న పట్టణ టీడీపీ నేతలు



మాసాపేటలో గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

రాయచోటి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు జన్మదినం సందర్భంగా రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, అధికారులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనను శాలువాలు, పూలమాలలు, గజమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రీతం రెసిడెన్సీలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు విదేశాల్లో సైతం కేక్‌లు కట్ చేసి, ఆలయాల్లో పూజలు, అన్నదానం చేసి, తమ ప్రియతమ నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీరబల్లి రోడ్డు నుంచి మాసాపేటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు కేరళ కళాకారుల వాయిద్యాల నడుమ ఆయనతో కలసి ర్యాలీ నిర్వహించి మాసాపేట నేతలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ప్రసాద్‌బాబు ఆలయం లో పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు. తనని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి సుగవాసి ప్రసాద్‌బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు తప్పక పాటించాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు

సుండుపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మామిడిలో పూత, పిందె దశలో సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, శాస్త్రవేత్త శ్రీనివాసులు తెలిపారు. శనివారం వెంగమరాజుగారిపల్లె సమీపంలోని మామిడి తోటలో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడిలో పూత, పిందె బాగా వచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. తేనె మంచు పురుగు, పక్షికన్ను తెగులు, మసి తెగులు, బూడిద తెగుళ్లను నివారించాలంటే పూత దశ, తెల్లపూత దశ, నల్లపూత దశలో మందులు పిచికారీ చేయాలన్నారు. పూత, పిందె ఒక్కసారిగా రావాలంటే మల్టీకే 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత, మొగ్గ దశలో మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటరు, గంధకం మూడు గ్రాములు, సాఫ్ రెండు గ్రాములు ఒక లీటరు నీళ్లలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చిపూత దశలో ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీలీటరు, వేపనూనె రెండు మిల్లీలీటరు, హెక్సాకొనజోల్ రెండు మిల్లీలీటరు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నల్లపూత దశలో గోళీకాయ దశల్లో తయోమోతాక్సిన్ 0.3 గ్రాములు, మాంకోజెబ్ రెండు గ్రాములు ఒక లీటరు నీళ్లకు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారిణి వనిత, గ్రామ ఉద్యాన సహాయకులు మల్లికార్జున, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని మల్లూరులో మామిడి పంట దిగుబడిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఉద్యానశాఖ అధికారులు నిర్వహించారు. ఉద్యాన అధికారి వనిత, శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, వీఆహెచ్ఎ, వీఏఉఏ, వీఎస్ఏ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ఉద్యమంలా సాగాలి


మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

● సీఎం నారా చంద్రబాబునాయుడు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితంలో వెలుగు నింపడమే తన బాధ్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంగా ఉద్యమంలా సాగాలని పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం మైదుకూరులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈరోజు ఒక చరిత్రకు శ్రీకారం చుట్టామన్నారు. స్వచ్ఛాంధ్ర సామాజిక సేవా కర్యాక్రమాల్లో అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉండగా 95-96లో పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునివ్వడంతో పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టామన్నారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర ఉద్యమం

ప్రతి నెల మూడో శనివారం కార్యాలయంలోని సిబ్బంది, విద్యార్థులు ప్రతి ఒక్కరు స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో పాల్పంచుకోవాలన్నారు. కొన్ని తరాలు శ్రమపడితే తప్ప మార్పు వచ్చే అవకాశం లేదన్నారు. ప్రతి ఒక్కరు మైండ్ సెట్‌ను మార్పు చేసుకోవాలన్నారు. బాడీని కంట్రోల్‌లో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యం కలుగుతుందన్నారు. మొదట ఇళ్లు చక్కగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆ తర్వాత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలు పెద్దల్లో పర్యావరణంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించవచ్చనేది నిరూపణ చేశామన్నారు. చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో 85లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసిందన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి ఈ చెత్త ద్వారా సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను వచ్చి వెళ్లిన తర్వాత సీబీఎన్ మార్క్ కనపడాలని పేర్కొన్నారు. రాష్ట్రమంతా స్వచ్ఛంగా ఉండాలనేదే తన ఆశయం అన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

పరిసరాల పరిశుభ్రతలో మంచి ప్రతిభ కనబరచిన పారిశుధ్య కార్మికులు చెన్నమ్మ, అమ్ములమ్మ, గంగాధర్‌తో పాటు రాష్ట్రపతి అవార్డు అందుకున్న అనకాపల్లె జిల్లాకు చెందిన పంచాయతీ కార్యదర్శి త్రినాథ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కరించారు. సీఎం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల క్యాష్ అవార్డులు కూడా ప్రకటించారు. కడపకు చెందిన అలేఖ్య మాట్లాడుతూ ఇంటి నుంచి వచ్చే చెత్తను కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి మిద్దె తోట ద్వారా కూరగాయలు పండించుకుంటున్నామన్నారు.

మైదుకూరులో మోడల్‌గా..

మైదుకూరులో మోడల్‌గా తీర్చిదిద్దుతామని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మైదుకూరులో ఏడు కిలోమీటర్ల మేర పట్టణ పరిధిలో, ఐదు కిలోమీటర్లు గ్రామీణ పరిధిలో సీసీ బీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా వందశాతం మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను తీసుకొస్తామన్నారు. డ్రైనేజీ వాటర్ శుభ్రపరిచి చెరువులు నింపే విధానాన్ని తీసుకొస్తామన్నారు. ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటుచేసే దానికోసం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అమృత్ కింద రూ.90కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు అందరికి ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. అదేవిధంగా రాయితీపై సోలార్ విద్యుత్‌ను ఏర్పాటుచేస్తామని తద్వారా కరెంట్ బిల్లులు కట్టే పరిస్థితి లేకుండా ఉంటుందన్నారు. దీపం-2 ద్వారా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, మైదుకూరులో ఇంటికి పైపుల ద్వారా గ్యాస్ కనెక్షన్ ఇచ్చే పనిని కూడా చేపడుతామన్నారు.

కూటమి విజయం ప్రజలదే

గత ఏడాదిలో జరిగిన ఎన్నికల్లో కూటమికి చెందిన 93శాతం మంది అభ్యర్థులను గెలిపించిన ఘనత ఈ రాష్ట్ర ప్రజలదేనన్నారు. ఈ క్రమంలోనే కేంద్రంలో మన పరపతి పెరిగిందని రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి కోసం రూ.2200కోట్లు నిధులు కేటాయించారన్నారు. దీనితో పాటు రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు భారీస్థాయిలో నిధులు కేటాయించారన్నారు. ఎన్టీఆర్ పింఛన్ పథకం కింద ఏడాదికి రూ.33వేలకోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు.




కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతినెల మూడు శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం సంతోషకరమన్నారు. చెత్త సేకరణలో ఇప్పటి వరకు 80శాతం ప్రగతి సాధించామన్నారు. వచ్చే ఆరు నెలల్లో వందశాతం ప్రగతిని సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ వెంటిలేటర్ మీద ఉన్న రాష్ట్రాన్ని ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం ఊపిరి పోసిందన్నారు. దీనితో సంతోషంగా రాష్ట్రంలోని ప్రజలు సంక్రాతి పండుగను జరుపుకొన్నారన్నారు. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేస్తే ఈ ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టిస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, అమరావతి, పోలవరం పనులు ఊపందుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ మైదుకూరు నుంచి ఒక కార్యక్రమానికి అంకురార్పణ చేస్తున్నామన్నారు. దేశంలో ఏ ఒక్క రాష్ట్రం చేపట్టని క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని గతంలో ప్రారంభించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. స్వచ్ఛభారత్ ఏర్పాటు అయ్యాక స్వచ్ఛభారత్ అభియాన్‌కు చంద్రబాబునాయుడు నాయకత్వం వహించారన్నారు. 2047లోపు రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన వివరించారు. వెయ్యి టన్నుల చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుదాకర్‌యాదవ్ మాట్లాడుతూ మైదుకూరుకు ముఖ్యమంత్రి రావడంతో ఒక పడుగ వాతావరణం ఏర్పడిందన్నారు. వ్యాపారంలో ఉన్న తనను రాజకీయాలకు తీసుకొచ్చి ఎమ్మెల్యేను చేసిన చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటానన్నారు. రాటజలి నిర్మాణానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. బ్రహ్మంగారిమఠంను టూరిజం హబ్‌గా చేయాలని మరిన్ని నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. ముందుగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రొద్దుటూరు బద్వేలు మాజీ ఎమ్మెల్యేలు లింగారెడ్డి, విజయమ్మ, జమ్మలమడుగు, బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జిలు భూపేష్‌రెడ్డి, రితీష్‌రెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ గుజ్జల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, సీఎంకు సమస్యలను వివరిస్తున్న ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, స్వచ్ఛతా ర్యాలీ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 26 కేంద్రాలు
● 4242 మంది విద్యార్థులు హాజరు


మాయాబజారులోని మున్సిపల్ వివేకానంద హైస్కూల్‌లో నవోదయ పరీక్షలు రాయడానికి లోపలికి వెళుతున్న విద్యార్థులు

మదనపల్లె అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు 26 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్లు వలసపల్లె నవోదయ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేలాయుధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నిర్వహించిన నవోదయ పరీక్షలకు 5058 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 4242 మంది హాజరై పరీక్షలు రాశారన్నారు. 816 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే పరీక్షల కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతించారు. మదనపల్లెలో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలను, పట్టణంలోని నీరుగుట్టువారిపల్లెలో మాయాబజార్‌లోని మున్సిపల్ వివేకానంద హైస్కూల్ ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. మయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం పురం వెంకటరమణ ఆధ్వర్యంలో నవోదయ పరీక్షలు రాసే విద్యార్థులను పరిశీలించి లోనికి అనుమతి ఇచ్చారు.

నడిరోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు

● గంటల తరబడి ట్రాఫిక్ జామ్


నిలబడిపోయిన బస్సును తోస్తున్న ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాయచోటి పట్టణం బస్టాండు వద్ద మొరాయించింది. ఈ బస్సులో దాదాపు 20 మంది ప్రయాణికులు ఉండగా బస్సు దారిలో నిలబడిపోవడంతో ఇటు నుంచి వెళ్లే వాహనాలకు చాలా ఇబ్బంది కలిగింది. ఈ బస్సు పీలేరు నుంచి రాయచోటికి వస్తుండగా ఆగిపోయినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. కాగా బస్సు కండీషన్‌ను సరిచూడకుండా ఎలా నడుపుతారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం రామును వివరణ కోరగా.. పీలేరుకు సంబంధించిన బస్సు నిలబడిపోయిన మాట వాస్తవమేనని, ఆ బస్సు చాలా రోజుల నుంచి రిపేరులో ఉందని, వీలైనంత త్వరలో తయారు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు..

● ఆర్పివేసిన స్థానికులు

సిద్దవటం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నుంచి చెన్నైకి వెళుతున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రయాణికులను ఎక్కించుకునేందుకు పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భాకరాపేటలో నిలపగా, ఒక్కసారిగా రేడియేటర్ నుంచి మంటలు రేగాయి. దీంతో డ్రైవరు బస్సు ఇంజన్‌ను ఆఫ్ చేశారు. విషయం గమనించిన స్థానికులు బిందెలతో నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనతో హైవేపై దాదాపు 20 నిముషాల పాటు వాహనాలు నిలిచిపోయారు. ఈ విషయమై ఏఎస్‌ఐ సుబ్బరామచంద్రను మాట్లాడుతూ ఈ బస్సులు 18 మంది ప్రయాణికులుండగా, వారందరినీ వేరే బస్సుల్లో గమ్యస్థానాలకు చేర్చామని తెలిపారు.

మిరప రైతు కంట కన్నీరు

● వైరస్, తెగుళ్లతో తగ్గిన దిగుబడి


కల్లంలో గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మైలవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన మిరప పంట ఈ ఏడాది రైతుకు కన్నీటిని మిగిల్చింది. వాతావరణంలో మార్పు, వైరస్, తెగుళ్లు, చీడ పీడల బెడద, మార్కెట్‌లో ధరలు తగ్గుదల వంటివి మిరప రైతుకు తీవ్ర నిరాశను మిగిల్చాయి. సాగు చేసిన మిరప పంటకు అప్పులకు వెనుకాడకుండా ముందుకు సాగి తీవ్ర నష్టాలతో మునిగామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాధారం, బోరు, బావుల కింద మండలంలో దాదాపు 3 వేల ఎకరాలకు పైగా మిరప పంట సాగైంది. తేజ రకం, నెంబరు 5 మిరప రకాన్ని ఎక్కువగా సాగు చేశారు. గత ఏడాది ఆగస్టు నుంచి మిరప పంట సాగు చేశారు. మిరప నారు నాటినప్పటి నుంచి సేద్యాలు, ఎరువులు, మందుల పిచికారి చేస్తూ పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయితే వాతావరణం మార్పులతో వైరస్ సోకడం, తెగుళ్లు, నల్లి, కాయకుళ్లు, పంటపై తీవ్ర ప్రభావం చూపింది. కాయదశలో వాతావరణం మార్పుతో కాయపై మచ్చ ఏర్పడింది. దీంతో కాయ నాణ్యత దెబ్బతిని తాలు ఎక్కువైంది. పంట కోతకు సమానంగా కల్లాల్లో కాయల గ్రేడింగ్‌కు ఖర్చు అవుతుందని మిరప రైతులు అంటున్నారు. ఈ ఏడాది మిరప పంటలో తేజ రకం ఎకరాకు 10-13 క్వింటాళ్లు, నెం.5 కూడా అంతే దిగుబడి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి ఎక్కువ కావడంతో ఎకరా మిరప పంట సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. మిరప పంట మంచి దిగుబడి, గిట్టుబాటు ధర లభిస్తే లాభాలు వస్తాయి. అయితే ప్రస్తుతం మార్కెట్ ధరలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. గత సంవత్సరం పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు అమాంతంగా పడిపోవడంతో ఎక్కువ మంది రైతులు మిరపకాయలను ఏసీ గోడౌన్లలో నిలువ చేసుకున్నారు. మంచి ధర వస్తే అమ్మాలని రైతులు ఎదురుచూస్తున్నారు. రైతుల ఆశలపై నీళ్లు చల్లేలా రోజు రోజుకు ధరలు మరింత దిగజారాయి. రెండేళ్ల క్రితం వరకు తేజా రకాలు రూ.20 నుంచి రూ.25 వేల వరకు ధర పలికాయి. ప్రస్తుతం సగం ధర కూడా అందడం లేదని రైతులు అంటున్నారు. ఈ ధరలకు పంటను అమ్మితే పెట్టుబడి ఖర్చులు కూడా రావని మిరప పంటకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లతో మిరపకు దెబ్బ

- వెంకటేశు, రైతు



మిరప పంటలో వైరస్, వాతావరణ మార్పులతో తెగుళ్లతో తీవ్ర నష్టం వాటిల్లింది. తాలు కాయలు పెరగడంతో గ్రేడింగ్ చేసేటప్పుడు ఎక్కువగా తెల్లకాయలు వస్తున్నాయి. ఖర్చులు ఎక్కువై దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ధరలు పతనం

- జయరాం, రైతు



రెండేళ్ల క్రితం ఉన్న ధరలకు, ఇప్పటి ధరలకు చాలా తేడా ఉంది. రోజు రోజుకు ధరలు పతనమవుతున్నాయి. దీంతో ఆశించిన ఆదాయం వస్తుందో.. రాదో.


సాగుచేసిన మిరప పంట

మీ కుటుంబంలో ఒక్కడిలా ఆదరించారు

● సినీనటుడు కిరణ్ అబ్బవరం


డ్యాన్స్ చేస్తున్న కిరణ్ అబ్బవరం, రుక్సార్ ఢిల్లాన్

కురబలకోట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మీ కుటుంబంలో సొంతమనిషిలా ఆదరించారు. మీరు చూపిన ఆదరాభిమానాలు తన జీవితంలో వెలకట్టలేనివని సినీ నటుడు కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో దిల్ రుబా సినిమాకు డైరెక్టర్ విశ్వకరుణ్, హీరో హీరోయిన్లుగా కిరణ్ అబ్బవరం, రుక్సార్ ధిల్లాన్ నటించిన ఈ చిత్రం పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన నిజ జీవితంలో ఒక నిర్ధిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాన్ని సాధించడానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా ప్రతిఒక్కరి జీవితంలో సాధించాలనే పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. చదువులో ఇంజనీరింగ్ పూర్తి చేసి, సినీ రంగంలో రాణిస్తున్నానన్నారు. మదనపల్లెతో తనకు విడదీయరాని అనుబంధం ఉన్నదని, పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు, ఇక్కడికి సినిమాలు చూడటానికి, షాపింగ్ చేయడానికి తరచూ వచ్చేవాడినన్నారు. తాను బెంగళూరులో ఉద్యోగం చేసేటప్పుడు ఈ మార్గంలో ద్విచక్రవాహనంలో వెళ్లేవాడినన్నారు. ఈ సినిమాలో రాయలసీయ ప్రాంతానికి చెందిన వారు నటించారని, ఇప్పటికే ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నదని, సినిమాను ఫిబ్రవరి 14న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నామని చూసి ఆదరించాలని కోరారు. అనంతరం సినిమాలోని సాంగ్‌కు హీరో, హీరోయిన్‌తో పాటుగా మిట్స్ విద్యార్థులు డ్యాన్సులు వేసి పలువురిని ఆకట్టుకున్నారు. అలాగే విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేసి యువతను ఆకట్టుకున్నారు. అనంతరం వచ్చే నెలలో మిట్స్‌లో నిర్వహించే అశ్వ కార్యక్రమానికి సంబంధించి టీజర్‌ను హీరో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, వైస్ ప్రిన్సిపాల్ కమాల్‌బాషా, రామనాథం తదితరులు అభినందించారు.

హోరాహోరీగా సబ్‌జూనియర్ హాకీ టోర్నమెంట్


హాకీ టోర్నమెంట్ సెమీ ఫైనల్లో తలపడుతున్న కడప, తిరుపతి జట్లు

మదనపల్లెటౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో నిర్వహిస్తున్న అంతర్‌జిల్లా సబ్‌జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో హోరాహోరీగా వివిధ జిల్లాల జట్లు తలపడ్డాయి. శనివారం లీగ్ దశల్లో ప్రీ క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించగా నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. ఇందులో తొలి సెమీఫైనల్లో తిరుపతి జట్టుపై కడప జట్టు 4-1 గోల్స్ చేసి ఫైనల్స్‌కు చేరుకుంది. అంతకు ముందు క్వార్టర్ ఫైనల్స్‌లో మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో కాకినాడపై కడప జట్టు, రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై తిరుపతి జట్టు, మూడో క్వార్టర్ ఫైనల్స్‌లో వెస్ట్ గోదావరి జట్టుపై అన్నమయ్య జిల్లా జట్టు, నాలుగో క్వార్టర్ ఫైనల్స్‌లో చిత్తూరు జట్టుపై అనకాపల్లె జట్టు గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజ్, కోశాధికారి థామస్, జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్, శివప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

పుల్లంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై పుల్లంపేటకు చెందిన నవీన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం ఉపాధిహామీ ఏపీడీ ప్రతాప్ విచారణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో ఫిర్యాదుదారు. ఫీల్డ్ అసిస్టెంట్ సమక్షంలో విచారణ చేశారు. పుల్లంపేటకు చెందిన జె.ఉమ, ఆమె కుమారుడు దినేష్, ఉపాధి పనులకు వెళ్లకపోయినా, వారి పేరుతో కూలి మంజూరు కావడంతో వారిని కూడా విచారణ చేశారు. తమకు జాబ్‌కార్డులు ఉన్నట్లే తెలియదని, తమ కుమారుడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని, నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు లిఖిత పూర్వకంగా ఏపీడీకి ఫిర్యాదు చేశారు. వలంటీర్ మాధవి ఉపాధి పనులకు వెళ్లినట్లు ఫిర్యాదులో ఉండడంతో ఆమెను కూడా పిలిచి విచారణ చేశారు. వలంటీర్ విధులు ఉన్న రోజుల్లో తప్ప, మిగతా రోజుల్లో ఉపాధి పనికి వెళ్లవచ్చని, అలా కాకుండా అన్ని రోజులు ఉపాధి కూలీగా పనిచేసినట్లు ఉంటే రికవరీ చేస్తామని ఏపీడీ తెలిపారు. ఇలాంటి ఫిర్యాదులు నిర్ధారణ అయిన సందర్భాల్లో, వలంటీర్ నుంచి రికవరీ చేసి, ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించామన్నారు. ఒకే రేషన్‌కార్డులో ఉన్న దంపతులకు రెండు వేర్వేరు ఐడీలు నమోదు చేసి నిధులు దుర్వినియోగం చేసిన అంశంపై కూడా ఏపీడీ విచారణ చేశారు. రికార్డులు పరిశీలించి నివేదికను అధికారులకు పంపుతామని ఏపీడీ తెలిపారు. ఈ విచారణలో ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.


అక్రమాలపై విచారణ చేస్తున్న ఏపీడీ

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


బారెడ్డి ఓబుల్‌రెడ్డి మృతదేహం

చెన్నూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతు బారెడ్డి ఓబుల్‌రెడ్డి (50) వ్యవసాయంలో అప్పులు పెరిగి, వత్తిళ్లు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఉప్పరపల్లె వాసి ఓబుల్‌రెడ్డి కొన్నేళ్లగా స్వగ్రామంలోనే వ్యవసాయం చేసేవాడు. పరిస్థితులు అనుకూలించ కపోవడం, పంట చేతికి అందకపోవడం, అప్పులకు వడ్డీ పెరగడం, వత్తిడి తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. రోజూ అప్పుల వారి వత్తిల్లు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులతో చెప్పి మదనపడేవాడు. దీంతో ఆరోగ్యం కూడా దెబ్బతినింది. చివరికి ఆత్మహత్యే శరణ్యమనుకుని శుక్రవారం పెండ్లిమర్రి మండలం ఆరవేటిపల్లెలో మరదలు ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. చీకటి పడ్డా కూడా ఇంటికి రాకపోవడంతో భార్య తులశమ్మ, కుమారుడు, కుమార్తె ఫోను చేశారు. ఎలాంటి సమాధానం రాకపోవడంతో వారు ఆందోళనకు గురయ్యారు. శనివారం ఉదయం హైవేలోని హజ్‌హౌస్‌కు దక్షిణ వైపు ఉన్న పాత అన్నక్యాంటీన్‌లో పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడని కనుగొన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి

డాక్టరు నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు


రామయ్య మృతదేహం

పోరుమామిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రామాయపల్లె వాసి కారు రామయ్య (45) వైద్యం వికటించి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రామయ్య మృతికి డాక్టరు నిర్లక్ష్యమే కారణమన్నారు. గురువారం రాత్రి రామయ్య కడుపు, ఛాతిలో మంటగా ఉందని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పోరుమామిళ్లలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టరు అన్ని వివరాలు కనుక్కుని కడుపులో గ్యాస్ ఉందంటూ ఇంజక్షన్, ట్యాబ్లెట్లు, సిరప్ ఇచ్చాడు. తరువాత ఇంటికి వెళ్లిన రామయ్యకు వాంతులు ఎక్కువ కావడం, అస్వస్థతకు గురవడంతో కుటుంబీకులు మళ్లీ ఆస్పత్రికి తీసుకునివచ్చారు. డాక్టరు ఎంతసేపటికీ స్పందించకపోగా, చివరికి డాక్టరు పరీక్షించే సమయానికి అతను మృతి చెందాడని ధృవీకరించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టరు నిర్లక్ష్యమే కారణమని, ఆస్పత్రి ఎదురుగా ఉన్న పోలీసులకు తెలిపారు. రామయ్య శవంతో రాత్రి నుంచి ఉదయం వరకు ఆస్పత్రిలోనే బైఠాయించారు. శుక్రవారం మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్‌ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ - ఒకరు మృతి


బాదుల్లా మృతదేహం

పెండ్లిమర్రి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప-పులివెందుల ప్రధానరోడ్డులో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బాదుల్లా (50) మృతిచెందాడు. మిట్టమీదపల్లె వాసి బాదుల్లా 40ఏళ్లుగా చుట్టుపక్కల ప్రాంతాల్లో పరుపులు అమ్ముతూ, కుడుతూ జీవించేవాడు. రోజువారి పని నిమిత్తం వ్యాపారం చేసుకుని ఆటోలో జంగంరెడ్డిపల్లె, రంపతాడు రహదారి నుంచి కడప-పులివెందుల మెయిన్‌రోడ్డు ఎక్కుతుండగా పులివెందుల నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆటోపల్టీలు కొట్టి అందులో ఉన్న బాదుల్లాకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన కడప రిమ్స్‌కు 108లో తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు.

డ్రాఫ్టరూల్స్ అసంబద్ధాలను తొలగించాలి

- ఆర్జేడీకి పీఎస్‌టీయూ వినతి


ఆర్జేడీకి వినతిపత్రం సమర్పిస్తున్న పీఎస్‌టీయూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బదిలీలు, రేషనలైజేషన్ చట్టబద్ధత డ్రాఫ్ట్ రూల్స్‌లోని అసంబద్ధాలను తొలగించాలని లేకపోతే వేలాదిగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సర్‌ప్లస్ అవుతారని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జమాల్‌రెడ్డి కోరారు. శనివారం కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ 6,7,8 తరగతుల సెక్షన్ల విషయంలో ప్రస్తుతం విడుదల చేసిన డ్రాఫ్ట్ రూల్స్‌లో తీవ్ర అన్యాయం జరుగుతోందని వివరించారు. కేవలం ఆరుగురు విద్యార్థుల తేడాతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక పాఠశాలలో మూడు సెక్షన్లు తగ్గి వేలాది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ అవుతారన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీపీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, రామలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

టీచర్ల పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి

జడ్పీ సీఈఓకు ఏపీటీఎఫ్ వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది ప్రావిడెంట్ ఫండ్ వార్షిక వివరాల స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబుళమ్మను కలిసి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులు 2023-24 పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, పీఎఫ్ నెలవారీ జమలను ఆన్‌లైన్‌లో ఉంచాలని, పీఎఫ్ రుణాలను, ఫైనల్ పేమెంట్లను మంజూరు చేయడంలో జాప్యం లేకుండా చూడాలని, ఉన్నత పాఠశాలల్లోని నాన్‌టీచింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, టీచర్ల ఖాతాల కు జమకాని డీఏ మొత్తాలను వారి అకౌంట్లలో జమచేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

కారు కాల్చిన సంఘటనపై కేసు నమోదు

రాయచోటిటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్డీస్‌కాలనీలోని ఎర్ర మసీదు వద్ద శనివారం తెల్లవారుజామున కారును కాల్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... ఎర్రమసీదు ప్రాంత వాసి అఫ్సాన్‌పై జాహిద్ సహా మరికొందరు దాడి చేసి గాయపర్చారు. మిత్రుడు అఫ్సాన్‌పై ఇస్రాన్ రెండు రోజుల కిందట దాడి చేయించాడని అనుమానించిన నాసిర్ అలియాస్ డాకు, అబుజర్, గౌర్ మరొకరితో కలిసి శనివారం తెల్లవారుజామున ఎర్ర మెసేజ్ సమీపంలో తన ఇంటి ముందు నిలిపి ఉన్న స్కోడా కారుపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. దీంతో బాధితుడు ఇస్రాన్ శనివారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అర్బన్ సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జహీర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కారు దగ్ధం చేసిన గంజాయి బ్యాచ్ గతంలో కూడా చార్మినార్ హోటల్, అరేబియన్ హోటల్ ఎదురుగా స్పోర్ట్స్ సెంటర్, మయూర బేకరీ బిల్డింగ్ యజమాని రబ్బానిపైన, కొత్తపేట టాటూ సెంటర్‌పై సంఘటనలకు పాల్పడినట్లు సమాచారం.

నిధులొచ్చినా తప్పని అడ్డంకులు

'నాలుగులేన్ల' నిర్మాణానికి అటవీ అనుమతులు ?

ఆటంకాలు తొలిగేదెన్నడు? ● రైతులకు పరిహారం అందేదెప్పుడు


ఎరసాల మీదుగా వెళ్లే రసాపేట - కొత్తపల్లె నాలుగులేన్ల రోడ్డు

పోరుమామిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి మైదుకూరుకు తక్కువ దూరం, వేగంగా ప్రయాణించేందుకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణానికి మైదుకూరు నుంచి సీతారాంపురం వెళ్లే దారిలో జిల్లాసరిహద్దు వరకు రైతుల స్థల సేకరణ చేసింది. వారికి అవార్డు మంజూరైనా కొందరు రైతులకు రికార్డులు సరిగా లేకోవడంతో కొందరికి నష్టపరిహారం అందింది, మరికొందరికి డబ్బు అందాల్సి ఉంది. ఆర్డీఓ వెరిఫికేషన్ అయిన తరువాత వారికి అందే అవకాశాలున్నాయి. కానీ ఈ నిర్మాణం గతేడాది అక్టోబరులో ప్రారంభమైంది. 2026 ఏప్రిల్‌కు పూర్తిచేయాల్సి ఉంది. ఈ నిర్మాణం పూర్తయితే విజయవాడ - సింగరాయకొండకు, నేరుగా బెంగుళూరు నుంచి మైదుకూరుకు తక్కువ సమయంలో వెళ్లేందుకు అంచనాలు వేసి దాదాపు రూ.189 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఎద్దులాయపల్లె నుంచి సీతారాంపురం వరకు రోడ్డు విస్తరణ పనులు జరగాల్సి ఉంది. ఇందులో సీతారాంపురం వద్ద ఏడున్నర కిలోమీటర్లు అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. టేకూరుపేట చెక్‌పోస్టు నుంచి జిల్లా సరిహద్దు వరకు అనుమతులు ఇంకా రావాల్సి ఉంది. రంగసముద్రం బైపాస్ 1.8 కిలోమీటర్లు పెండింగులో ఉంది. ఇందులో రైతులకు నష్టపరిహారం అందాల్సి ఉండగా, రికార్డులు అందిస్తే ఆర్డీఓ వెరిఫికేషన్ అయిన తరువాత వీరికి పరిహారం అందే అవకాశం ఉంది. టేకూరుపేట నుంచి రజాసాహెబ్‌పేట వరకు ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. నర్సింగ్‌పల్లె నుంచి రంగసముద్రం వరకు నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ రోడ్డు విస్తరణకు సంబంధించి 38.12 ఎకరాలు సంబంధించి 397 మంది రైతులకు ప్రభుత్వం రూ.9,92,40,120 అవార్డు ప్రకటించింది. కాశినాయన మండలానికి సంబంధించి 6.81 ఎకరాలకు 56 మంది రైతులకు రూ.86,80,251 అవార్డు ప్రకటించింది. బి.కోడూరు మండలానికి సంబంధించి 2.44 ఎకరాలకు సంబంధించి 44 మంది రైతులకు రూ.27,99,460లు అవార్డు ప్రకటించింది. పోరుమామిళ్ల మండలానికి సంబంధించి 16.54 ఎకరాలకు సంబంధించి 55 మంది రైతులకు రూ.3,61,16,678లు అవార్డు ప్రకటించింది. బి.మఠం మండలానికి సంబంధించి 12.33 ఎకరాలకు 242 మంది రైతులకు రూ.5,16,43,731లు అవార్డు ప్రకటించింది. ఇంకా ఇప్పటికీ 351 మంది రైతులకు రూ.7,62,96,346లు నష్టపరిహారం అందాల్సి ఉంది. ఈ రైతులకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేసి ప్యాకేజీ పొందాల్సి ఉంది. ప్రస్తుతం టేకూరుపేట చెక్‌పోస్టు సమీపంలో రజాసాహెబ్‌పేట నుంచి ఎరసాల మీదుగా అర్త్ వరకు నిర్మాణం జరుగుతున్నాయి. మధ్యలో బ్రిడ్జిల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి 10 శాతమే పనులు జరిగాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రైతులకు సంబంధించి పూర్తిగా నష్టపరిహారం అందించి నిర్మాణం వేగవంతం చేస్తే భవిష్యత్తులో మైదుకూరు నుంచి విజయవాడకు వెళ్లాలన్నా ఈ రహదారి సింగరాయకొండ మీదుగా విజయవాడ వెళ్లేందుకు విజయవాడ నుంచి మైదుకూరుకు అతి తక్కువ సమయం పట్టే అవకాశాలున్నాయి. ఈ వేసవిలో కల్లా అర్త్ పని పూర్తయితే వచ్చే కాలానికి పనులు మరింత వేగం అందుకోవచ్చు. గ్రావెల్‌కు సంబంధించి నీళ్ల చల్లాలని కొందరు చెబుతున్నారు. ఈ విషయం సంబంధిత శాఖ ఏఈ రామక్రిష్ణనాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో నీళ్ల చల్లుతున్నామని, దుమ్ము రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పనుల విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటే పనులు వేగంగా జరిగి ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.




నాలుగులేన్ల రహదారిపై బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు చేసిన దృశ్యం - మోరీలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం - టేకూరుపేట చెక్‌పోస్టు వద్ద జరుగుతున్న బ్రిడ్జిల నిర్మాణం

రెడ్లు సేవాతత్పరులు

రెడ్డి సేవాసమితి సేవలు ప్రశంసనీయం
రజతోత్సవాల్లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి



రెడ్డి సేవాసమితి రజతోత్సవాల్లో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి

కడప కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రెడ్లు సేవాతత్పరులని, వివిధ రంగాల్లో ప్రశంసనీయమైన సేవలందిస్తూ సాగుతున్న రెడ్డిసేవా సమితి సేవలు ప్రశంసనీయమని ఏపీ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి కొనియాడారు. రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక డీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సమితి రజతోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ ప్రోలయ వేమారెడ్డి మొదలుకుని నేటి వరకు అనేక మంది రెడ్లు దేశానికి సేవలందించారన్నారు. తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మొదలుకుని తెలుగు నేలపై 11 మంది రెడ్లు ముఖ్యమంత్రులుగా సేవలందించారన్నారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాట్లాడుతూ జిల్లాలో విశ్వవిద్యాలయానికి వైవీయూ పేరు పెట్టడం గర్వకారణమన్నారు. పది మందికి అన్నం పెట్టే గుణం రెడ్లకుందని, ఆ దిశగా సేవలందిస్తున్న రెడ్డి సేవా సమితి ఏర్పడడం రెడ్లకు తోడ్పాటన్నారు. రెడ్డిసేవా సమితి అధ్యక్షుడు ఆచార్య కుప్పిరెడ్డి నాగిరెడ్డి, వైవీయూ సహాచార్యులు కొవ్వూరు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పాతికేళ్లుగా విద్యావసతిని కల్పించి ఎందరో విద్యార్థినులకు ఆశ్రయం కల్పిస్తున్న రెడ్డి సేవాసమితి సేవలు అభినందనీయమన్నారు. హంస అవార్డు గ్రహీత డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవాసమితి అభ్యుదయం దిశగా సేవలందించడం వెనుక నిర్వాహకుల కృషిని కొనియాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు రేపటి సమాజానికి మార్గదర్శకాలన్నారు. అతిధులను, మేలుకొలుపు సంపాదకులు డాక్టర్ భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కొండూరు జనార్ధనరాజు, చదలవాడ వెంకటేశ్‌ను రెడ్డిసేవా సమితి నిర్వాహకులు సత్కరించారు. మేలుకొలుపు సంచిక అతిధులచే ఆవిష్కరించబడింది. రచయిత పుత్తాపుల్లారెడ్డి రచించిన మహాభారత విజ్ఞాన సర్వస్వం పుస్తకాన్ని ఆవిష్కరించి పుల్లారెడ్డికి సాహిత్య రత్నాకర బిరుదు ప్రదానం చేశారు. ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, పముఖ జానపద పరిశోధకులు ఆచార్య చిగిచెర్ల క్రిష్ణారెడ్డి, కొండా లక్ష్మీకాంతరెడ్డి, యలమర్తి మధుసూదన్, వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, గుడ్ల ఆదినారాయణరెడ్డి పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

ప్రాణం తీసిన హెర్నియా ఆపరేషన్

- ఆపరేషన్ సక్సెస్ అంటూ నమ్మబలికిన డాక్టరు
- ఆస్పత్రి వద్ద మృతురాలి బంధువుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం



కేవీఆర్ హాస్పిటల్ వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు - ఐసీయూలో రమాదేవి మృతదేహం

ప్రొద్దుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హెర్నియా ఆపరేషన్ మహిళ ప్రాణం తీసింది. అయితే ఆపరేషన్ సక్సస్ అయిందని, పేషెంట్‌ను అబ్జర్వేషన్‌లో ఉంచాలని డాక్టర్ నమ్మబలుకుతూ సినిమాటిక్‌ను ప్రదర్శించారని, డాక్టర్ ప్రదీప్‌రెడ్డిని శిక్షించాలని బాధిత గ్రామస్తులు హాస్పిటల్ వద్ద నినాదాలు చేశారు. చివరికి పోలీసుల జోక్యంతో సర్దు బాటైంది. వివరాల్లోకెళితే...

ఎర్రగుంట్ల మండలం తుమ్మల పల్లెకు చెందిన వడ్డెరపు రమాదేవి హెర్నియా సమస్యతో జనవరి 16న గాంధీరోడ్డు లోని కేవీఆర్ హాస్పిటల్‌లో చేరారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు హెర్నియా ఆపరేషన్ చేయాలని తెలిపారు. దీంతో వారు ఆపరేషన్‌కు సిద్దపడ్డారు. జనవరి 17న ఆపరేషన్ చేసి సక్సెస్ అయ్యిందని వైద్యులు తెలిపినట్లు రమాదేవి భర్త శ్రీనివాసులు వెల్లడించారు. అయితే రమాదేవిని ఐసీయూలో అబ్జర్వేషన్‌లో వుంచామని ఆమె ఆరోగ్యంగా వుందని నమ్మబలికారన్నారు. కానీ శనివారం ఉదయం నుంచీ ఆమెను చూసేందుకు అనుమతించమని కోరినా వారు చూపించకపోవడంతో రమాదేవికి ఏదో అయిందనే అనుమానం వచ్చిందన్నారు. దీంతో బంధువులు, ఊరివారిని ఆస్పత్రి వద్దకు రావాలని చెబుతుండగానే ఆస్పత్రికి పోలీసులు వచ్చారన్నారు. అంతేకాకుండా ప్రైవేటు వ్యక్తులు పెద్దఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకున్నారన్నారు. దీంతో రమాదేవి మరణించిందని ఖరారు చేసుకున్నామన్నారు. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వచ్చాక ఆయనతో పాటు మమ్మల్ని లోపలికి అనుమతించారన్నారు. ఆస్పత్రిలో రమాదేవి ఆపరేషన్ తరువాత మరణించడంపై కనీసం సమాచారం కూడా ఇవ్వని డాక్టర్, ఆస్పత్రి సిబ్బందిపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కనీసం ఫిర్యాదు స్వీకరించలేదని రమాదేవి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. రమాదేవికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వున్నాడని, భర్త జువారి ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడని మృతురాలి బంధువులు తెలిపారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనలో డిమాండ్ చేశారు.

ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ ప్రదీప్‌రెడ్డి వివరణ

మహిళ మృతిపై కేవీఆర్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ప్రదీప్‌రెడ్డిని వివరణ కోరగా పేషంట్ రమాదేవి హెర్నియా సమస్యతో కడుపు నొప్పితో బాధపడుతూ వచ్చిందన్నారు. ఆమెకు చాలాకాలంగా హెర్నియా వుందని అనేకసార్లు స్కానింగ్ చేయించిన హిస్టరీ మాకు వారు తెలపలేదు. పరిస్థితి చూసి ఆమెకు ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యుల అనుమతి తీసుకుని చేశాం. దాదాపు మూడున్నర గంటల పాటు కష్టపడి ఆమెకు ఆపరేషన్ చేశాం. లోపల ప్రేవులు చాలా మడత పడ్డాయి. ఆపరేషన్ మాత్రం సక్సెస్ అయ్యింది. తరువాత ఆమెకు బీపీ పల్స్ డౌన్ అయ్యి శాచురేషన్ పాయింట్‌లు పడిపోయాయి. సీపీఆర్‌చేసి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశాం కానీ ఫలితం లేకుండాపోయింది.

పేదల పెన్నిధి ఎన్టీఆర్

- ఘనంగా తెలుగుజాతి ముద్దుబిడ్డ నందమూరి తారకరామారావు వర్ధంతి
- పెద్దఎత్తున నివాళులర్పించిన టీడీపీ శ్రేణులు
- మదనపల్లెలో వేర్వేరుగా కార్యక్రమాలు
- ఎమ్మెల్యే ఓ వైపు, టీడీపీ సీనియర్ నాయకులు మరో వైపు


మదనపల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే


ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న తెలుగు యువత శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పేదల పెన్నిధి, తెలుగువారి ఆరాధ్యుడు, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ శ్రేణులతోపాటు ఎన్టీఆర్ అభిమానులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఈ సందర్భంగా ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. కాగా మదనపల్లెలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా ఏర్పడి వేర్వేరుగా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. శనివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్‌సర్కిల్, నిమ్మనపల్లె సర్కిల్, మండలంలోని సీటీఎం గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కాగా టీడీపీ సీనియర్ నాయకులు తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ తనయుడు దొమ్మలపాటి యశశ్విరాజ్, జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి కలసి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నివాళులర్పించారు. శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ పాత టీడీపీ నాయకులను కొంత మంది అధికారులు పట్టించుకోవడంతో లేదని, కొత్తవారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్పూరి శశి ధర్‌రావు, దేవరింటి శ్రీనివాసులు, మేకలరెడ్డిశేఖర్, దొరస్వామినా యుడు, అరుణ్‌తేజ, రాజారెడ్డి, పఠాన్‌ఖాదర్‌ఖాన్, రెడ్డిరామ్‌ప్రసా ద్, చల్లా నరసింహులు, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

పీలేరులో: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని శనివారం పీలేరులోని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలతో అలంకరించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, వృద్ధాప్య పింఛన్లు, మహిళలకు ఆస్తి హక్కు, పటేల్ పట్వారీ వ్యవస్థల రద్దు, మండల వ్యవస్థ ఏర్పాటు వంటి విప్లవాత్మక మార్పులతో ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి, యల్లెల రెడ్డప్ప రెడ్డి, లక్ష్మీకర, పోలిశెట్టి సురేంద్ర, స్పోర్ట్స్ మల్లి, షౌకత్ అలీ, అతార్ చాను, పురం రెడ్డమ్మ, రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, వాణి, వీణ, స్వర్ణ, షమ, అనూరాధ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: నిరుపేదల గుండె చప్పుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని కూటమి నాయకులు కొనియాడారు. శనివారం వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ బస్టాండ్ కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేస్తూ ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని చౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ, అన్నదానాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ సురేంద్రవర్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పులి నరేంద్రరెడ్డి. పీలేరు మైనార్టీ నాయకుడు సయ్యద్‌బాషా, వీవీ నారాయణ, రాజేంద్రాచారి, మురళి, బొక్కసం బ్రదర్, బీసీ మహిళా నాయకురాలు స్వర్ణలత, డిష్ బ్రదర్, పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంవగా నాయకులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావంలోనే కిలో బియ్యం రెండు రూపాయలకు ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రెడ్డెప్పరెడ్డి, సుధాకరరావు, విజయ్‌రమణ, సుజాత శ్రీనివాసులు, నరేంద్ర, మల్లికార్జున, రాజన్న, రెడ్డెప్ప పాల్గొన్నారు.

గుర్రంకొండలో: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలను ఆ పార్టీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాండులో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయిని జగదీష్‌కుమార్, మూర్తిరావు, నౌషాద్ అహ్మద్, మురళీ, చలమారెడ్డి, చంద్రబాబు, సుంకరశేఖర్, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

కలకడలో: మాజీ సీఎం స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతిని శనివారం మండల అధ్యక్షుడు పొత్తూరి ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికారప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, కోట రమణనాయుడు, రైస్‌మిల్ రమణ, మల్లికార్జుననాయుడు, వసంతనాయుడు, శేఖర్‌నాయుడులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తెలుగు జాతికి వెలుగు రేఖ నందమూరి తారకరామారావు అని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి, టీడీపీ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు పేర్కొన్నారు. శనివారం తంబళ్లపల్లెలో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి జయచంద్రారెడ్డి హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ సుగవాసి శివకుమార్, మాజీ ఉప సర్పంచ్ మణి, టైల్స్ శీన, తెలుగు యువత నరసింహులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, క్లస్టర్ ఇంచార్జి బేరి శ్రీనివాసులు, బీసీ నాయకుడు తులసీధర్ నాయుడు, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్య దర్శి సోముశేఖర్, పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ శివకుమార్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: దివంగత, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతిని శనివారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్ర మైన పెద్దమండ్యంలో తంబళ్లపల్లి నియోజకవర్గం టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నేతలు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, మండల మాజీ అధ్యక్షు డు సిద్దవరం ప్రసాద్ కూటమి నేతలు గంగాధర, హసీంసాబ్, మహేశ్వర, సాంబ, నాగేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, కాలేషా, గల్లా నారాయణ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతిని కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండులో ఉదయం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన స్వర్గీయ నందమూరి తారకరామారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలికిరిలో: పేదల కోసమే తపించిన ఎన్టీఆర్‌కు టీడీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. శనివారం స్థానిక గాంధీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన టీడీపీ జెండా వద్ద ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఉంచి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు సహదేవ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, నాగభూషణ రెడ్డి, చిన్నరెడ్డెయ్య, వెంకటపతి, భాస్కర్ రెడ్డి, అబ్దుల్ కాదర్, ముస్తఫా, మాలతి, వైజాగ్ బాషా, సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు 29వ వర్ధంతిని శనివారం పార్టీలోని ఇరువర్గాలు వేర్వేరుగా నిర్వహించారు. నియోజకవర్గ నాయకుడు జయచంద్రారెడ్డి, టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్‌లు జ్యోతిచౌక్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, ఫలహారం అందించారు. అదేవిధంగా టీడీపీ మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, టౌన్‌కన్వీనర్ బంగారు వెంకట్రమణ, నియోజకవర్గ పోల్‌కోఆర్డినేటర్ కుడుంశ్రీనివాసులు ఆధ్వర్యంలో జ్యోతిచౌక్‌లో ఎన్టీఆర్‌కు నివాళులర్పించి అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాలలో నాయకులు డేరంగుల నారాయణ, చావిడికిట్టన్న, దేవరింటికుమార్, కనకంటిప్రసాద్, సుకుమార్, గంజిమోహన్, మొటుకుశివ, ప్రభాకర్, బావిసిద్దారెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక బస్టాండ్ సర్కిల్లో మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా ఆధ్వర్యంలో పార్టీ పతాకం ఎగురవేసి ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నేతలు చెన్నకృష్ణా, కేశవులు, ముత్తుకూరు మౌలా, సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ 29వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని చిత్రపటానికి తంబళ్ళపల్లె నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించ్నారు. అనంతరం అన్నదానం, ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్‌లు పంచిపెట్టారు. నియోజకవర్గ పరిశీలకుడు మల్లికార్జుననాయుడు, మండల అధ్యక్షుడు వై.జి..సురేంద్ర యాదవ్, మాజీ ఎంపీపీలు తిమ్మరాయుడు, వెంకటరమణారెడ్డి, తెలుగు యువత నియోజకర్గ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమణ, అయూబ్‌బాషా, రెడ్డిశేఖర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.


బి.కొత్తకోటలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు జయచంద్రారెడ్డి, పర్వీన్‌తాజ్


ములకలచెరువులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేత పాలగిరి సిద్దా, పార్టీ నేతలు


గుర్రంకొండలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్వచ్ఛత.. పరిశుభ్రత జీవన విధానం కావాలి


మదనపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

మదనపల్లె అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):స్వచ్ఛత.. పరి శుభ్రతలను ప్రతి ఒక్కరూ జీవన విధానంలా మార్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై చెత్తను ఊడుస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ ప్రమీల, టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, కౌన్సిలర్ తులసి రామకృష్ణ, టీడీపీ నాయకులు షంషీర్, నాగూర్‌వలి, జేసీబీ వేణు, చిప్పిలి చెంద్రాయులు, కమలమరికృష్ణ, ఎస్‌ఏ మస్తాన్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో అసిస్టెంట్ మేనేజరు రేవతి ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర, స్వర్ణ ఏపీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బాలికల జూనియర్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం ఆఫీసర్ సేగు రెడ్డెప్ప రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమం


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు

పీలేరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని అధికారులు శనివారం పీలేరులో అట్టహాసంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా రాయ చోటి ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇకపై ప్రతి నెలా మూడవ శనివారాన్ని స్వచ్ఛ దివస్‌గా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లతీఫ్ ఖాన్, తహసీల్దారు భీమేశ్వర రావు, టీడీపీ నేతలు అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి, శ్రీకాంత్ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, షౌకత్ అలీ, ప్రసాద్, చాన్‌బాషా, బుజ్జు, నౌలాక్, మహబూబ్ బాషా, వెంకటరమణ నాయక్, షమ, స్వర్ణ, ఏపీ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ధనాశి వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై పారిశుధ్యాన్ని పరిరక్షించాలని బి.కొత్తకోట నగరపంచాయతీ కమిషనర్ పల్లవి, టీడీపీ నేతలు జయచంద్రారెడ్డి, పర్వీన్‌తాజ్ లు పేర్కొన్నారు. శనివారం బి.కొత్తకోటలో నిర్వహించిన స్వచ్ఛదివస్ ర్యాలీలో వీరు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ, నగరపంచాయతీ ఏఓ రమాదేవి పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కలికిరిలో: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడవ శనివారం పంచాయతీ పరిధిలో ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించడం జరుగుతుందని కలికిరి మేజర్ పంచాయతీ కార్యదర్శి అశోక్ వెల్లడించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జయప్రకాష్, ఎంపీడీవో భానుమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : గ్రామాలను అత్యంత పరిశుభ్రంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేద్దామని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల స్థాయి అధికారులు,ప్రజాప్రతినిధులు, వెలుగు సంఘాలకు చెందిన మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యాలయ సిబ్బందితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: స్వచ్ఛత-శుభ్రత విషయంలో ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని వాల్మీకిపురం ఎంపీడీవో మనోహర్‌రాజు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్‌లో భాగంగా శనివారం వాల్మీకిపురంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం మండలంలో ముమ్మరంగా జరిగింది. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు మండల కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో దివ్యాంగుల పింఛన్ల తనిఖీ


పింఛన్ల తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నిమ్మనపల్లె జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగ పింఛన్లను రెండు రోజుల పాటు అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాంగా శనివారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలో 1, 2 సచివాలయాల్లో ప్రతినెల 15 వేల రూపాయలు ఫించన్ పొందుతున్న మంచానికే పరిమితమైన దివ్యాంగులను డాక్టర్లు పరిశీలించారు. రెడ్డివారిపల్లెలో 23 పింఛన్లు ఉండగా వాటిన్నింటినీ పరిశీలించి పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. కాగా ఈ మండలం మొత్తం 153 మందికి రూ.15వేలు పింఛన్ తీసుకొంటున్నవారిని పరీక్షించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, డాక్టర్లు నాగేశ్వర్‌రెడ్డి, రామరాజు, కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

పీటీఎం మండల పరిషత్ ఏవోగా నిత్యానంద్

పెద్దతిప్పసముద్రం జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయ ఏవోగా కేఎస్ నిత్యానంద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఏవోగా పని చేసిన జ్యోతిలత ఇటీవల పదవీ విరమణ చేశారు. దీంతో ఆమె స్థానంలో చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న కేఎస్ నిత్యానంద్ పెద్దతిప్పసముద్రం మండలానికి బదిలీపై వచ్చారు. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు.

కోళ్లబైలు కాలనీలో సమస్యలు పరిష్కరించండి

మదనపల్లె టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు కాలనీలో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ కోరారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో కోళ్లబైలుకాలనీ ప్రజలతో కలసి పునీత్ మాట్లాడుతూ కోళ్లబైలు కాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతున్నా ఇంత వరకు ఆ కాలనీలో రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించలేదన్నారు. 500 కుటుంబాలు నివశిస్తున్నా ఈ కాలనీ అభివృద్ధి గురించిపట్టించుకున్న నాథుడు లేడన్నారు. రోడ్లు లేకపోవడంతో ఈ కాలనీలోకి 108 అంబులెన్స్‌లు కూడా రావడం లేదని, తాగునీటి ట్యాంకు వచ్చినా గతుకుల రోడ్డుతో బోల్తాపడుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు శ్రీనివాసులు, జగదీష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

భూమిలో పోషక విలువలను కాపాడాలి

మదనపల్లె టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు, పురుగుమందుల పిచికారిలో భూమిలో పోషక విలువలు పడిపోతున్నాయని అందువల్ల ప్రకృతి వ్యవసాయం చేసి వాటిని కాపాడాలని ప్రకృతి వనం ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో ఏపీ మాస్ సంస్థ ఆధ్వర్యంలో 100 మంది రైతులకు రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వందేళ్ల ముందుకు ఇప్పటికి భూమిలో పోషక విలువలు 90శాతం తగ్గిపోయాయని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగప్రసాద్, ఝాన్సీ, ఏపీ మాస్ ప్రతినిధులు బావాజాన్, వాసుదేవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కారు ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

కురబలకోట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని రైతుకు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు మండలంలోని ముదివేడు పంచాయతీ అడవిపల్లెకు చెందిన కృష్ణారెడ్డి(65) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా పొంతపనుల నిమిత్తం ముదివేడు క్రాస్‌కు వెళ్ళి అక్కడ ఓ వ్యక్తితో మాట్లాడుతుండగా కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ అతన్ని స్థానికులు 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరగడంతో ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.7.21లక్షలు

గుర్రంకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మ అమ్మవారి హుండీని శనివారం దేవదాయశాఖ అధికారులు లెక్కించగా రూ.7,21,112 ఆదాయం వచ్చింది. ఇందులో అమ్మవారికి హుండీ ద్వారా రూ.7,21,112 నగదు, 29 గ్రాముల బంగారం, 425 గ్రాముల వెండీ వచ్చినట్లు దేవదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని అమ్మవారి ఆలయాభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

కలికిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకూ పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ వెంకటముని నాయుడు, మండల పశు వైద్య అధికారి డాక్టర్ గిరినాథ రెడ్డి తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు, ఇతర జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వివిధ రకాల వ్యాధులకు అవసరమైన చికిత్సలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో రెండేసి శిబిరాలు ఏర్పాటు చేస్తామని పాడి రైతుల, జీవాల పెంపకందార్లు ఈ అవకాశాలను వినియోగించుకోవలసిందిగా కోరారు. కాగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా శనివారం మండలంలోని అన్ని పశు వైద్యశాలల వద్ద, పరిసరాల్లోనూ పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయండి


టూరిజం చైర్మన్ బాలాజీని కలిసిన టీడీపీ బీసీ సెల్ నేత సురేంద్రయాదవ్

కురబలకోట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని టూరిజం శాఖ చైర్మన్ బాలాజీని టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్ కోరారు. పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో శనివారం ఆయన టూరిజం చైర్మన్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులను పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటర రంగాన్ని నిర్వీర్యం చేశారని, దానిని గాడిలో పెట్టాలని కోరారు. హార్సిలీహిల్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య వర్గపోరు
రామసముద్రంలో జరగని ఎన్టీఆర్ వర్ధంతి

రామసముద్రం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు మధ్య కొరవడిన సమన్వయ లోపం, వర్గపోరుతో శనివారం జరగాల్సిన టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి జరగలేదు. గతంలో ఎప్పుడూ కూడా ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ శ్రేణులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అయితే రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండికూడా టీడీపీ నేతలు అన్నగా పిలుచుకునే ఎన్టీఆర్ వర్ధంతిని జరుపుకోకపోవడం ఏమిటని పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ పాలనలో అనేక విధాలుగా పార్టీ ద్వారా లాభపడినవారు కూడా ఇప్పుడు పార్టీకి తీరని నష్టం చేస్తున్నారని పలువురు కార్యకర్తలు వాపోతున్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతిని జరుపుకోకపోవడంపై పార్టీ అధిష్టానం దృష్టి సారించి నాయకుల మధ్య వర్గపోరును తొలగించి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని కొన్ని పంచాయతీలలో కొంతమంది నాయకులు ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా ఎన్టీఆర్ వర్ధంతిని జరుపుకున్నారు. మాలేనత్తం గ్రామ పంచాయతీ టీడీపీ యువ నాయకులు రూపేష్‌రెడ్డి, చెంబకూరు గ్రామ పంచాయతీలో టీడీపీ నాయకులు ఇంజమ్ వెంకటరమణ, ఇలియాజ్, రామమూర్తి, వికాస్ వెంకటేష్, రాంమోహన్, మూగవాడిలో శివారెడ్డి ఎన్టీఆర్ వర్ధంతిని జరుపుకున్నారు. చెంబకూరులో అన్నదానం చేశారు.

కార్మిక చట్టాల రక్షణ కోసం ఉద్యమిద్దాం

ములకలచెరువు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఉద్యమిద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. శనివారం ములకలచెరువులో ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ 6వ మహాసభల సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు పరచి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు గంగాధర్, సురేష్‌కుమార్, సీపీఐ ములకలచెరువు మండల కార్యదర్శి అంజినప్ప, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సలీంభాష, వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు బషీర్, షమీవుల్లా, రెడ్డి మౌలాలి పాల్గొన్నారు.

21 నుంచి సామూహిక దీక్షలు

మదనపల్లె అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):మదనపల్లె ఆస్పత్రిని ప్రభుత్వమే నడపాలని కోరుతూ సర్వజన బోధనాస్పత్రి ఎదుట ఈ నెల 21, 22, 23 తేదీల్లో సామూహిక దీక్షలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ దీక్షలకు ప్రజలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు పూర్తి సహకారం అందివ్వాలని కోరారు.

వాహనచోదకులకు కంటిచూపు ముఖ్యం

మదనపల్లె టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వాహనచోదకులకు కంటిచూపు చాలా ముఖ్యమని రవాణాశాఖ జిల్లా అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్టీవో కార్యాలయంలో 36వ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్లకు ఉచిత కంటి చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లు కంటిచూపు భద్రతపై అవగాహన పెంచుకుని చూపును కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో అశోకప్రతాప్, ఎంవీఐలు దినేష్ చంద్ర, ఏఎంవీఐలు శివలింగయ్య, శ్రీహరి, ట్యాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

బడికాయలపల్లిలో ఘర్షణ

బి.కొత్తకోట, జనవరి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడికాయలపల్లెలో శుక్రవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణపడ్డాయి. గ్రామానికి చెందిన తెట్టుమారెప్ప, పాల చంద్రశేఖర్‌లు తమ తమ వర్గీయులతో కలిసి పరస్పరం దాడులు చేసుకుని ఇరువురూ ఫిర్యాదులు చేసుకున్నారు. ఆ మేరకు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

వాల్మీకిపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా శనివారం నవోదయ ప్రవేశ పరీక్షలు జరిగాయి. వాల్మీకిపురం, కలికిరి, కలకడ, గుర్రంకొండ మండలాలకు సంబంధించి 155మంది విద్యార్థులకుగాను 136మంది హాజరయ్యారు. ఎంఈవో హెచ్‌ఎం పర్యవేక్షించారు.